తెలంగాణ
TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | ఆదివారం - 17 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 349 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## ఇందిరమ్మ ఇండ్లకు కేంద్ర నిధుల కోసం ఎదురుచూపులు



- కేంద్రం నిధులు ఇవ్వకపోతే రాష్ట్రమే భరిస్తుంది
- జూన్ 2న రెండో విడత ప్రారంభం
- భూముల ధరల సవరణకు ప్రభుత్వం సిద్ధం

**హైదరాబాద్, మే 16 (తెలంగాణ ముచ్చట్లు):-** రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధుల కోసం రాష్ట్రం ఎదురుచూస్తోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కేంద్రం నుంచి రావాల్సిన వాటా నిధులు ఆలస్యమైనప్పటికీ లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. శనివారం తన ఛాంబర్‌లో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మాట్లాడిన మంత్రి, ఈ ఏడాది మార్చి నెల నుంచి కేంద్ర నిధుల కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. ఒక్కో ఇంటికి కేంద్రం వాటాగా సుమారు లక్షా పదమూడు వేల రూపాయలు విడుదల కావాల్సి ఉందన్నారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయనే ఆశతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఫైనల్ బిల్లుల చెల్లింపును తాత్కాలికంగా నిలిపినట్లు వివరించారు. అయితే మరో 15 నుంచి 20 రోజుల్లోగా నిధులు విడుదల కాకపోతే రాష్ట్ర ప్రభుత్వమే ఆ మొత్తాన్ని భరించి లబ్ధిదారులకు నేరుగా

మిగతా 2లో..

## బండి సంజయ్ తొలగింపుపై కవిత డిమాండ్



- ప్రధానమంత్రి మోదీకి లేఖ పంపింపు
- విచారణపై ప్రభావం ఉండొద్దన్న అభిప్రాయం
- నిష్పక్షపాత దర్యాప్తు జరగాలన్న విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 16 (తెలంగాణ ముచ్చట్లు-):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కె. కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసి పలు అంశాలను ప్రస్తావించారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన నేపథ్యంలో ఈ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రివర్గానికి సంబంధించిన చట్ట పరమైన నైతికత, ప్రజా విశ్వాసం వంటి కీలక అంశాలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకువస్తున్నానని కవిత తన లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా చట్ట అమలు వ్యవస్థలతో సంబంధం ఉన్న కీలక శాఖలో కొనసాగుతున్న వ్యక్తిపై ఇలాంటి వివాదం నెలకొనడం ఆందోళన కలిగిస్తోందని అభిప్రాయపడ్డారు. హోంశాఖ వంటి కీలక విభాగంలో బండి సంజయ్ కొనసాగడం వల్ల కేసు దర్యాప్తుపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలకు సంబంధించిన కేసులో దర్యాప్తు పూర్తిగా స్వతంత్రంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని కోరారు.

మిగతా 2లో..

## అంతర్రాష్ట్ర సైబర్ మోసాల ముఠా గుట్టురట్టు




- ఆరుగురు నిందితుల అరెస్ట్
- ఫోన్ మోసాలపై పోలీసుల చర్యలు
- పదిహేను లక్షల నగదు స్వాధీనం

**హైదరాబాద్, మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతున్న సైబరాబాద్ పోలీసులు మరో కీలక విజయాన్ని నమోదు చేశారు. అంతర్రాష్ట్ర స్థాయిలో పనిచేస్తున్న వ్యవస్థీకృత సైబర్ మోసాల ముఠాను సైబర్ క్రైమ్ విభాగం ఛేదించింది. ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఫోన్ మోసాలు, సిమ్ మార్పిడి మోసాలకు పాల్పడుతున్న ముఠాపై ప్రత్యేక దర్యాప్తు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వీరు పలు రాష్ట్రాల్లో విస్తృతంగా మోసాలకు పాల్పడుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. ముఖ్యంగా ఫోన్ కాల్స్ ద్వారా ప్రజలను మోసం చేసే విధానాన్ని ఈ ముఠా అనుసరించినట్లు అధికారులు తెలిపారు. బ్యాంకు అధికారులు, సాంకేతిక సిబ్బంది పేర్లతో ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు సేకరించి మోసాలకు పాల్పడినట్లు గుర్తించారు. అలాగే సిమ్ మార్పిడి విధానాన్ని ఉపయోగించి బాధితుల మొబైల్ నంబర్లను తమ ఆధీనంలోకి తీసుకుని బ్యాంకు ఖాతాలపై నియంత్రణ సాధించినట్లు పోలీసులు తెలిపారు. ఈ పద్ధతి ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహించి

మిగతా 2లో..

## బండి భగీరథ్ కేసులో కీలక పరిణామం

- కోర్టులో బాధితురాలి వాంగ్మూలం
- తల్లితో కలిసి మేడ్చల్ కోర్టుకు హాజరు
- సిట్ దర్యాప్తుపై ఆసక్తి

**హైదరాబాద్, మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో బాధితురాలు తన తల్లితో కలిసి మేడ్చల్ కోర్టుకు హాజరై మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చింది. ఈ పరిణామం కేసు దర్యాప్తులో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే బాధితురాలు రెండు సందర్భాల్లో పోలీసులకు తన వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. తాజాగా కోర్టులో నమోదు చేసిన ప్రకటనతో పాటు బాధితురాలి తల్లి వాంగ్మూలాన్ని కూడా పోలీసులు రికార్డు చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో తన కుమార్తెకు బలవంతంగా మద్యం ఇచ్చారని, ఆ తర్వాత బలహీన స్థితిలో ఉన్న సమయంలో భగీరథ్ ఒత్తిడి చేసి అనుచితంగా ప్రవర్తించాడని తల్లి ఆరోపించినట్లు సమాచారం. ఈ ఘటన తర్వాత తన కుమార్తె చాలా కాలంగా మానసిక వేదన అనుభవిస్తోందని ఆమె పేర్కొన్నట్లు తెలిసింది. ఈ కేసులో ప్రస్తుతం ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తు కొనసాగిస్తోందని బాధితురాలి తల్లి తెలిపారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు,

మిగతా 2లో..



## భగీరథ్‌ను పోలీసులకు అప్పగించిన బండి సంజయ్

చట్టానికి అందరూ సమానమేనన్న కేంద్ర మంత్రి

విచారణకు పూర్తి సహకారం అందిస్తామన్న స్పష్టీకరణ

కేసులో ఆధారాలు సమర్పించినట్లు వెల్లడి

2లో



## మహిళలకు స్త్రీనిధి అండ: సీతక్క

- ప్రజాభవన్‌లో వార్షిక కార్యాచరణ సమావేశం
- మహిళల ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- స్త్రీనిధి సేవలపై మంత్రి ప్రశంసలు

**హైదరాబాద్, మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీనిధి సంస్థ ఒక బలమైన వేదికగా నిలుస్తోందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన స్త్రీనిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళల ఆర్థిక సాధికారతకు స్త్రీనిధి చేస్తున్న సేవలను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి, డిప్యూటీ ఎండీ శ్రీనాథ్‌తో పాటు పెద్ద సంఖ్యలో స్త్రీనిధి

మిగతా 2లో..





## మలక్‌పేట్ రైల్వే స్టేషన్‌కు కొత్త రూపు

- వేగంగా ఆధునికీకరణ పనులు
- రూ. 26.50 కోట్లతో విస్తృత అభివృద్ధి పనులు
- ఇప్పటికే 65 శాతం పనులు పూర్తి చేసిన అధికారులు
- హైదరాబాద్ రవాణా అవసరాలకు అనుగుణంగా ఆధునిక సదుపాయాలు

**హైదరాబాద్, మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** నగర జనాభా పెరుగుదలతో పాటు రవాణా అవసరాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని మలక్‌పేట్ రైల్వే స్టేషన్‌కు కొత్త రూపు తీసుకొచ్చేందుకు భారీ స్థాయిలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. ప్రయాణికులకు మెరుగైన అనుభవం అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ పనులను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి శనివారం ఉదయం పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. మలక్‌పేట్ రైల్వే స్టేషన్ అభివృద్ధి

మిగతా 2లో..

## 2027 డిసెంబర్ నాటికి దేవాదుల ప్రాజెక్టు పూర్తి

- మరో రూ. 3,978 కోట్లతో పనులు పూర్తి లక్ష్యం
- 5.57 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం
- పనుల్లో వేగం పెంచిన ప్రభుత్వం

**హైదరాబాద్, మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని 2027 డిసెంబర్ మాసాంతానికి పూర్తి చేయడానికి స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేసినట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ప్రాజెక్టు పూర్తి ద్వారా పది జిల్లాల్లోని లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని తెలిపారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సహచర మంత్రులు

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బండి భగీరథ్ కేసులో కీలక పరిణామం

(మొదటి పేజీ తరువాయి)

వాస్తవాలు విచారణలో బయటకు వస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఈ వ్యవహారానికి సంబంధించి తమ వద్ద వాట్సాప్ చాటింగ్‌లు, సందేశాలు, ఇతర ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఆధారాలు కూడా ఉన్నాయని వెల్లడించినట్లు తెలిసింది. దర్యాప్తులో ఈ ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు అన్ని కోణాల్లో ఆధారాలను పరిశీలిస్తున్నాయి. కేసులో తదుపరి పరిణామాలపై రాజకీయ, సామాజిక వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# భగీరథ్‌ను పోలీసులకు అప్పగించిన బండి సంజయ్

**హైదరాబాద్, మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో తన కుమారుడిని న్యాయవాదుల ద్వారా పోలీసులకు అప్పగించినట్లు బండి సంజయ్ వెల్లడించారు. చట్ట ప్రకారం జరిగే విచారణకు పూర్తిగా సహకరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ చట్టం ముందు తన కుమారుడు అయినా, సామాన్య వ్యక్తి అయినా అందరూ సమానమేనని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థపై తనకు ఉన్న గౌరవంతోనే భగీరథ్‌ను విచారణ కోసం అప్పగించామని చెప్పారు.

దేశంలో ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. వ్యక్తిగత సంబంధాల కంటే చట్టం గొప్పదనే భావనతోనే తాము వ్యవహరిస్తున్నామని తెలిపారు. తన కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని పదేపదే చెబుతున్నాడని బండి సంజయ్ వెల్లడించారు. కేసుకు సంబంధించిన ఆధారాలను కూడా న్యాయవాదుల ద్వారా పోలీసులకు అందజేసినట్లు పేర్కొన్నారు. వాస్తవానికి ఫిర్యాదు వచ్చిన తొలి రోజుల్లోనే భగీరథ్‌ను పోలీసులకు అప్పగించాలని భావించినట్లు తెలిపారు. అయితే కేసుకు సంబంధించిన కొన్ని ఆధారాలను సమర్పించాల్సిన అవసరం ఉండటంతో కొంత ఆలస్యం జరిగిందని వివరించారు.

ఇక ఆలస్యం చేయడం సమంజసం కాదని భావించి చట్టపరమైన ప్రక్రియలో భాగంగా కుమారుడిని పోలీసులకు అప్పగించినట్లు వెల్లడించారు. సమర్పించిన ఆధారాలను పోలీసులు పరిశీలించిన తర్వాత నిజానిజాలు బయటకు వస్తాయని, కేసు కొట్టివేయబడుతుందని న్యాయవాదులు చెప్పినట్లు బండి సంజయ్ తెలిపారు. బెయిల్ కూడా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మైనర్ బాలిక కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బండి భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోంది.

# మహిళలకు స్త్రీనిధి అండ: సీతక్క

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా స్త్రీనిధి ఉద్యోగులు ఏర్పాటుచేసుకున్న సిబ్బంది సంక్షేమ సంఘాన్ని మంత్రి అభినందించారు. ఉద్యోగుల ఐక్యత సంస్థ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు.

ఉద్యోగులు తమ వ్యక్తిగత ప్రయోజనాలతో పాటు సంస్థ లక్ష్యాలను కూడా గుర్తుంచుకోవాలని సీతక్క సూచించారు. లక్షలాది మహిళల జీవితాలతో ముడిపడిన స్త్రీనిధి సంస్థను మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులు కల్పించడమే కాకుండా బాధ్యతలను కూడా నిర్దేశించిందని మంత్రి గుర్తుచేశారు. స్త్రీనిధి సంస్థను ఉద్యోగులు తమ కుటుంబంలా భావించి కాపాడుకోవాలని సూచించారు. సంస్థ అభివృద్ధి చెందితే ఉద్యోగుల భవిష్యత్తు కూడా మరింత భద్రంగా ఉంటుందని పేర్కొన్నారు.

రెండు వేల పదకొండులో ప్రారంభమైన స్త్రీనిధి సంస్థ ప్రస్తుతం మహిళల ఆర్థిక సాధికారతలో కీలకపాత్ర పోషిస్తోందని మంత్రి తెలిపారు. అధిక వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్న మహిళలను ఆదుకోవడానికి ఈ సంస్థ ఏర్పాటైందన్నారు. ప్రస్తుతం ఇది గ్రామీణ మహిళలకు పెద్ద ఆధారంగా మారిందని వివరించారు. ఇప్పటివరకు స్త్రీనిధి ద్వారా ముప్పై రెండు లక్షల మందికి పైగా మహిళలకు ఇరవై నాలుగు వేల కోట్ల రూపాయల రుణాలు అందించడం గొప్ప విజయమని సీతక్క పేర్కొన్నారు. తెలంగాణ మహిళలకు స్త్రీనిధి ఒక నమ్మకమైన మహిళా బ్యాంక్‌గా ఎదుగుతోందని కొనియాడారు. ఇతర రాష్ట్రాలు కూడా ఈ నమూనాను అనుసరిస్తున్నాయని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమేనని మంత్రి స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు అందించే వడ్డీ లేని రుణాల పరిమితిని ఐదు లక్షల నుంచి పది లక్షల రూపాయలకు పెంచినట్లు వెల్లడించారు. మహిళల అభివృద్ధే తెలంగాణ అభివృద్ధికి ప్రధాన పునాదిగా ప్రభుత్వం భావిస్తోందన్నారు. దేశ స్థూల ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. గ్రామీణ మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తూ వారి జీవనోపాధిని మెరుగుపరచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

స్త్రీనిధి సంస్థపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల కోసం పనిచేస్తున్న సంస్థ ప్రతిష్టను దెబ్బతీయడానికి అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రచారాలను ఉద్యోగులంతా కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్త్రీనిధి అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ఎండీ విద్యాసాగర్ రెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో పదవీ విరమణ చేయనున్న ఆయన సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానించారు. కొత్త నాయకత్వంలో స్త్రీనిధి మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

# 2027 డిసెంబర్ నాటికి దేవాదుల ప్రాజెక్టు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి దేవాదుల ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 38.16 టీఎంసీల నీటితో హనుమకొండ, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, సిద్ధిపేట, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల్లోని 5.57 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. 2004-05లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రూ.6,016 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో భారీగా ఆలస్యమైందని మంత్రి విమర్శించారు. సవరించిన అంచనాల ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ.18,400 కోట్లకు చేరిందన్నారు.

ఇప్పటికే ప్రాజెక్టుపై రూ.14,422 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మిగిలిన పనులను పూర్తి చేయడానికి మరో రూ.3,978 కోట్ల వ్యయం అవసరమని పేర్కొన్నారు. నిధుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు పనులు 87.70 శాతం పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. ప్రధాన పంప్ హౌసులు, పైప్‌లైన్ వ్యవస్థలు, సొరంగ మార్గాల పనులు ఎక్కువ భాగం పూర్తయ్యాయని తెలిపారు. అయితే పంపిణీ కాల్వలు, భూసేకరణ, కొన్ని నిర్మాణ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. దేవాదుల ప్రాజెక్టులో మొత్తం 20 పంప్ హౌసులు, 642 కిలోమీటర్ల పైప్‌లైన్లు, 57 కిలోమీటర్లకు పైగా సొరంగ మార్గాలు, 20 రిజర్వాయర్లు, 306 ప్రధాన కాల్వలు, 2,185 కిలోమీటర్ల పంపిణీ కాల్వలు ఉన్నాయని మంత్రి వివరించారు.

ఆసియాలోనే అత్యంత పొడవైన 49 కిలోమీటర్ల డీఆకారపు సాగునీటి సొరంగం కూడా ఈ ప్రాజెక్టులో భాగమని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు అవసరమైన విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. భూసేకరణ ప్రాజెక్టు అమలులో ప్రధాన అడ్డంకిగా మారిందని అధికారులు వివరించినట్లు మంత్రి తెలిపారు. మొత్తం అవసరమైన భూమిలో ఇంకా 2,659 ఎకరాల సేకరణ పెండింగ్‌లో ఉందని చెప్పారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

పనులు ఆలస్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఒప్పందాలు రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని మంత్రి ఆదేశించారు. సాగునీటి సామర్థ్యం పెంపులో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు అనేక గ్రామాలకు తాగునీటి సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రసాదం తిన్న 62 మంది అస్వస్థత..

- యూపీ గ్రామంలో కలకలం
- ఆధ్యాత్మిక కార్యక్రమం అనంతరం ఘటన
- కడుపునొప్పి, వాంతులతో ఆస్పత్రులకు పరుగులు
- ప్రసాదం నమూనాలను పరీక్షకు పంపిన అధికారులు



**ఉత్తర ప్రదేశ్, మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఉత్తర ప్రదేశ్‌లోని ఒక గ్రామంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమం అనంతరం ప్రసాదం తిన్న భక్తులు ఒక్కసారిగా అస్వస్థతకు గురవడంతో కలకలం రేగింది. ఈ ఘటన కన్నౌజ్ జిల్లాలోని సిమౌపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఘటనలో మొత్తం 62 మంది వరకు అనారోగ్యానికి గురైనట్లు అధికారులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిమౌపూర్ గ్రామానికి చెందిన మున్నాలాల్ కశ్యప్ తన నివాసంలో ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బంధువులు, సన్నిహితులు, గ్రామస్థులను ఆహ్వానించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం హాజరైన వారికి భోజన ప్రసాదం పంపిణీ చేశారు. అయితే ప్రసాదం తీసుకున్న కొన్ని గంటలకే పలువురిలో అస్వస్థత లక్షణాలు కనిపించాయి. మొదట కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు మొదలవగా ఆ తర్వాత కొందరి ఆరోగ్య పరిస్థితి మరింత బలహీనంగా మారింది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ప్రాథమికంగా బాధితులను సమీపంలోని ప్రైవేటు క్లినిక్‌లకు తరలించి చికిత్స అందించారు. అయితే ఒకేసారి పెద్ద సంఖ్యలో ఒకే రకమైన లక్షణాలు బయటపడటంతో పరిస్థితి తీవ్రతరమైందని భావించిన వైద్యులు వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మొత్తం 62 మంది ఆస్పత్రిలో చేరినట్లు సమాచారం. ప్రస్తుతం వారికి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. బాధితుల పరిస్థితి స్థిరంగానే ఉందని, ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యాధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఘటనకు గల అసలు కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రసాదం నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. ఆహార విషబాధ జరిగిందా లేదా ఇతర కారణాలున్నాయా అనే దిశగా పరిశీలిస్తున్నారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు కేంద్ర నిధుల కోసం ఎదురుచూపులు

(మొదటి పేజీ తరువాయి)

అందజేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొదటి విడతలో మూడున్నర లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు సుమారు లక్షా ముప్పై రెండు వేల ఇండ్ల నిర్మాణం పూర్తయిందని, జూన్ నెలాఖరుకు మరో 68 నుంచి 72 వేల ఇండ్ల శ్లాబ్ నిర్మాణం పూర్తవుతుందని వెల్లడించారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తారని తెలిపారు. ఈ విడతలో పలు వెసులుబాట్లు కల్పించనున్నట్లు వెల్లడించారు. బేస్‌మెంట్ దశలో ఉన్న ఇళ్లు, గోడలు మాత్రమే ఉన్న ఇళ్లు, శ్లాబ్ పూర్తికాని నిర్మాణాలను కూడా ఇందిరమ్మ పథకం పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఎన్ని ఇండ్లు కేటాయించాలనే అంశంపై ఈ నెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో రెవెన్యూ, సర్వే, భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం సంయుక్త సర్వే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను గుర్తించి సమగ్ర సర్వే చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. భూ రిజిస్ట్రేషన్ వ్యవస్థలో సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు కొత్త సాఫ్ట్‌వేర్ ఏర్పాటుకు టెండర్లు ఖరారు చేసినట్లు వెల్లడించారు.

గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి కొత్త కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. లబ్ధిదారులకే మిగిలిన నిధులు అందించి వారిచేత నిర్మాణ పనులు పూర్తి చేయించే విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో భూముల ధరల సవరణపై కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ నెలాఖరులోగా శాస్త్రీయ పద్ధతిలో కొత్త ధరలను ప్రకటించి అమల్లోకి తీసుకువస్తామని వెల్లడించారు. ప్రజాదర్బార్‌లలో వచ్చిన ఫిర్యాదుల్లో అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించినవే ఉన్నాయని మంత్రి తెలిపారు. తరువాత స్థానాల్లో భూ సమస్యలు, ఆసరా పెన్షన్లు, గృహ పథకాలు, రేషన్ కార్డుల అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

# అంతర్రాష్ట్ర సైబర్ మోసాల ముఠా గుట్టురట్టు

(మొదటి పేజీ తరువాయి)

డబ్బులను అక్రమంగా కాజేసినట్లు అనుమానిస్తున్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు పదిహేను లక్షల రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదనంగా మరిన్ని ఆధారాలు, సాంకేతిక పరికరాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ ముఠాకు ఇతర రాష్ట్రాలతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మోసాల పరిమాణం మరింత విస్తృతంగా ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. అపరిచితుల ఫోన్ కాల్స్, వ్యక్తిగత సమాచారం అడిగే వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ పోలీసులు సూచించారు. బ్యాంకు వివరాలు, రహస్య సంఖ్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు.

# బండి సంజయ్ తొలగింపుపై కవిత డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)


న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాలంటే ఈ కేసుపై ఎలాంటి రాజకీయ ప్రభావం ఉండకూడదని కవిత అభిప్రాయపడ్డారు. విచారణ ప్రక్రియ పూర్తిగా స్వేచ్ఛగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కేసులో దర్యాప్తు పూర్తయ్యే వరకు బండి సంజయ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి తప్పించాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. దీనివల్ల మైనర్ల భద్రత, న్యాయ వ్యవస్థకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందన్న సందేశం ప్రజల్లోకి వెళుతుందని పేర్కొన్నారు. కాగా, పదిహేడేళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల ఎనిమిదో తేదీన భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహితతో పాటు పోక్సో చట్టంలోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.

# మలక్‌పేట్ రైల్వే స్టేషన్‌కు కొత్త రూపు

(మొదటి పేజీ తరువాయి)

కోసం రూ. 26.50 కోట్ల వ్యయంతో విస్తృత ప్రణాళిక రూపొందించారు. నగరంలో వేగంగా పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని స్టేషన్‌ను ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దే పనులు జరుగుతున్నాయి. కేవలం రైల్వే స్టేషన్‌గా కాకుండా, ప్రయాణికులకు సౌకర్యవంతమైన రవాణా కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా పనుల స్థితిగతులను పరిశీలించిన కిషన్ రెడ్డి, నిర్మాణ పనులు ఆశించిన వేగంతో కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రాజెక్టులో ఇప్పటికే దాదాపు 65 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది. ప్రస్తుతం స్టేషన్‌లో మౌలిక వసతుల విస్తరణ, ఆధునిక ప్రయాణికుల సదుపాయాల ఏర్పాటు, ప్లాట్‌ఫారమ్‌ల అభివృద్ధి, సౌకర్యవంతమైన వేచివుండే ప్రదేశాలు, మెరుగైన ప్రవేశ మార్గాలు వంటి పలు పనులు కొనసాగుతున్నాయి. ప్రయాణికులు రద్దీ సమయంలో ఇబ్బందులు పడకుండా స్టేషన్‌లో అంతర్గత సౌకర్యాలను కూడా పునర్నిర్మిస్తున్నారు. ప్రత్యేకంగా రోజువారీ ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో రాకపోకలు సులభతరం అయ్యే విధంగా మార్గాల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక వసతులు, పరిశుభ్రత చర్యలపై కూడా దృష్టి పెట్టినట్లు సమాచారం. హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు అధిక ప్రాధాన్యత ఏర్పడింది. ప్రజా రవాణాను మరింత సమర్థవంతంగా మార్చడంలో ఇలాంటి ప్రాజెక్టులు కీలకంగా మారుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మలక్‌పేట్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పూర్తయిన తర్వాత ప్రయాణికులకు మరింత నాణ్యమైన సేవలు, సౌకర్యవంతమైన వాతావరణం, వేగవంతమైన రాకపోకలు అందుబాటులోకి రానున్నాయి. నగర రవాణా వ్యవస్థలో ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.

## రైతులను కాపాడాలంటే కాలువల పూడిక తీయాలి



◆ బిజెపి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్

**ఎల్కతుర్తి, మే 15( తెలంగాణ ముచ్చట్లు- ):** రైతులను ముంపు ప్రమాదం నుంచి కాపాడాలంటే మండలంలోని గొలుసుకట్టు కాలువలు, పిల్ల కాలువల పూడికను తక్షణమే తొలగించాలని బిజెపి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్కతుర్తి మండలంలోని 20 గ్రామాల పరిధిలో ఉన్న కాలువల దుస్థితిపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు నిర్లక్ష్యం వీడి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కాలువల్లో పేరుకుపోయిన పూడిక కారణంగా ప్రతి ఏడాది వర్షపు నీరు సాఫీగా వెళ్లక రైతులు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంట పొలాలు నీట మునిగిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అక్రమణలకు గురైన గొలుసుకట్టు కాలువలు, కెనాల్ కాలువలను గుర్తించి వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. బావుల వద్ద ఉన్న కాలువలు, పొలాలకు నీరందించే పిల్ల కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించకపోతే బిజెపి ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని శ్రీకాంత్ యాదవ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య, ఆడెపు శ్రీవర్ధన్, కొడం రమేష్, మాటూరు విద్యాసాగర్, చీరాల రంజిత్, సూదిరెడ్డి సాయిరెడ్డి, రవి పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా శీలంశెట్టి వీరభద్రం ఏకగ్రీవ ఎన్నిక



**ఖమ్మం బ్యూరో, మే 16(తెలంగాణ ముచ్చట్లు ):** మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా శీలంశెట్టి వీరభద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతోపాటు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి దేవేంద్రం, కోశాధికారిగా మదూరి పూర్ణచంద్రరావు, గౌరవ అధ్యక్షుడిగా కొత్త సీతారాములు ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం నగరంలోని గ్రాండ్ గాయత్రి హోటల్లో సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆకుల గాంధీ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి హాజరైన నాయకులంతా అధ్యక్షుడు ఎంపిక నిర్ణయాన్ని సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నిర్ణయానికి వదిలేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆ మేరకు జిల్లా స్థాయిలో సంఘం నిర్మాణం, భవిష్యత్ అవసరాలు, సమస్యలపై చురుకుగా స్పందించే తత్వం కలిగిన శీలంశెట్టి వీరభద్రం పేరు ఆయన ప్రకటించగా సభ్యులంతా హర్షద్వానాలతో అంగీకారం తెలిపారు. అనంతరం మున్నూరు కాపు సంక్షేమ సంఘం అనుబంధ సంఘాలైన యువజన, మహిళా విభాగాలకు సైతం ఏకగ్రీవంగా కమిటీలను ఎన్నుకున్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా తోట రమేష్, ప్రధాన కార్యదర్శిగా మాటేటి కిరణ్ కుమార్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా పగడాల మంజుల, తోట సుజలా రాణి ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రముఖులు మేకల బిక్షమయ్య, ఆర్జెసి కృష్ణ, కనకం జనార్ధన్, పొదిల రవికుమార్, శెట్టి రంగారావు, లక్కినేని రఘు, గీతా వెంకన్న, పొన్నం వెంకటేశ్వర్లు, బచ్చు విజయ్ కుమార్, జాబిశెట్టి శ్రీనివాసరావు, వివిధ నియోజకవర్గాల బాధ్యులు ఆళ్ల కృష్ణ, మారిశెట్టి వెంకటేశ్వరరావు, తోట గణేష్, మాజీ కార్పొరేటర్లు తోట రామారావు, మాటి నాగేశ్వరరావు, తోట వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## డీజిల్, పెట్రోల్ ధరల పెంపుతో సామాన్యుడిపై పెనుభారం : సొల్లు బాబు

**హుజురాబాద్,మే (తెలంగాణ ముచ్చట్లు ):** దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ద్వారా భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం సామాన్య ప్రజలపై పెనుభారం మోపుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొల్లు బాబు విమర్శించారు. అంతర్జాతీయంగా కొన్ని దేశాల్లో యుద్ధ పరిస్థితులు ఉన్నప్పటికీ, ఇటీవల జరిగిన రాష్ట్ర ఎన్నికల సమయంలో కేంద్ర మంత్రులు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగవని ప్రజలకు హామీలు ఇచ్చారని, ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచి ప్రజలను మోసం చేశారని ఆయన ఆరోపించారు. లీటర్‌కు పెట్రోల్‌పై రూ.3.40, డీజిల్‌పై రూ.3.27 పెంచడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. ఇంధన ధరల



పెంపుతో అన్ని నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలను అబద్ధాలతో మోసం చేస్తూ పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని సొల్లు బాబు హెచ్చరించారు.

# డెంగ్యూ నివారణలో ఆరోగ్య సిబ్బంది కీలక పాత్ర పోషించాలి

### డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రవణ్ కుమార్



**హుజురాబాద్,మే 16(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్‌లో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రవణ్ కుమార్ ప్రారంభించారు. వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రత నిర్వహణలో ప్రతిభ కనబరిచాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో కలిసి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రతిజ్ఞ చేయించారు.

గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య పనులను సమర్థవంతంగా పంచాయితీ సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.

ఆరోగ్య సిబ్బంది నిరంతర కృషితోనే వ్యాధుల నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, జిల్లా ఆరోగ్య బోధకులు పంజాల ప్రతాప్ గౌడ్, సబ్ యూనిట్ ఆఫీసర్ రాజేంద్ర రాజు, హెల్త్ అసిస్టెంట్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కాంగ్రెస్ నిరసన ర్యాలీ




**సత్తుపల్లి, మే 16(తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. సత్తుపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ బాలాజీ థియేటర్ మీదుగా ఓల్డ్ బస్టాండ్ వరకు కొనసాగింది. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మార్గనిర్దేశనం చేశారు. నాయకులు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, చల్లగుళ్ళ నరసింహారావు, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు సందీప్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

# సింగరేణిలో ఉత్పత్తి లక్ష్యాలపై ఫోకస్

◆ సత్తుపల్లి ఏరియాలో మల్టీ డిపార్ట్మెంట్ టీమ్ సమావేశాలు.



**సత్తుపల్లి, మే 16(తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి, రవాణా లక్ష్యాల సాధనపై సత్తుపల్లి ఏరియా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో శనివారం సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ చింతల శ్రీనివాస్ నాయకత్వంలో జీఎం కార్యాలయంలో పత్రిక విలేకర్ల సమావేశం నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఉత్పత్తి వివరాలను సమీక్షించిన అధికారులు, ప్రస్తుత సంవత్సరానికి సంస్థ వ్యాప్తంగా నిర్దేశించిన 65 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాలపై చర్చించారు. సత్తుపల్లి ఏరియాలోని జేవీఆర్ ఓసీ నుంచి 110 మిలియన్ టన్నులు, కిష్టారం ఓసీ నుంచి 24 మిలియన్ టన్నులు, జేవీఆర్ సీహెచ్‌పీకి 134 మిలియన్ టన్నుల రవాణా లక్ష్యాలను సాధించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. లక్ష్యాల సాధనలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ కార్మికులు, సూపర్వైజర్లు, అధికారులను సమన్వయం చేయడమే మల్టీ డిపార్ట్మెంట్ టీమ్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ నెల 19, 20, 21 తేదీలలో జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ, జేవీఆర్ సీహెచ్‌పీ విభాగాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మల్టీ డిపార్ట్మెంట్ టీమ్‌లో ఎస్‌వోటు జీఎం శ్రీ బొల్లం శ్రీనివాస్, డీజీఎం(ఈ అండ్ ఎం) శ్రీ కె.సోమశేఖరరావు, ఏజీఎం(ఎఫ్ అండ్ ఏ) శ్రీ భీభాత్స, పర్సనల్ మేనేజర్ శ్రీ ఎల్. తిరుపతి, డీజీఎం(ఐఈ) శ్రీ ఎన్. యోహాన్, అదనపు మేనేజర్ శ్రీ కె. సత్యనారాయణ రాజు సభ్యులుగా ఉన్నారు. అనంతరం జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ, జేవీఆర్ సీహెచ్‌పీ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, యూనియన్ ప్రతినిధులు, ఉత్తమ ఉద్యోగులతో సమావేశమై వారి సూచనలు, సలహాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కిష్టారం ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ ఏఎల్ఎస్‌వీ సునీల్ వర్మ, జేవీఆర్ ఓసీ ప్రాజెక్ట్ ఇంజనీర్ శ్రీ డి. శ్రీనివాసరావు, ఎస్‌వోఎం శ్రీ బి. రాజేశ్వరరావు, కిష్టారం ఇన్‌చార్జి మేనేజర్ శ్రీ వి. బాబు, ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ శ్రీ సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ శ్రీ ఎస్. సుధాకర్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ బి. కోటేశ్వరరావు, వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీ కె. శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న మద్దిగట్లమోజర్ల పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు



**వనపర్తి,మే16(తెలంగాణ ముచ్చట్లు):** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో కళలు, హస్తకళలు మరియు సాంస్కృతిక దినోత్సవ కార్యక్రమం శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్దమందడి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్దిగట్లమోజర్ల విద్యార్థులు బంజారా నృత్యం, తెలంగాణ బోనాల పండుగకు సంబంధించిన నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ కీమ్యా నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని ప్రారంభించారు. పెద్దమందడి మండల విద్యాధికారి మంజులత విద్యార్థుల ప్రదర్శనలను తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ఎస్ వరప్రసాద్ రావు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ పాఠశాల తరపున తప్పకుండా పాల్గొంటామని పేర్కొన్నారు. కార్యక్రమానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ ఇందిర, జిల్లా కోఆర్డినేటర్లు శేఖర్, మహానంది, నారాయణమ్మ, ప్రతాప్ రెడ్డి, జిల్లా పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడు ఎం బౌద్ధ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ చంద్రశేఖర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పి ప్రసాద్, వ్యాఖ్యాత బైరోజు చంద్రశేఖర్, చిక్కేపల్లి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు శివయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పి వెంకటస్వామి, పుల్లయ్య, మధుసూదన్, చిన్నారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు డి రణదీవ్, అమ్మపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శశివర్ధన్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## హుజురాబాద్ రూరల్ సీఐ శ్రీనివాస్‌కు ఘన సన్మానం




**హుజురాబాద్, మే 16(తెలంగాణ ముచ్చట్లు ):** బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో హుజురాబాద్ రూరల్ సీఐ శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. బీసీ ఆజాద్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పూల బోకే అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకమారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇటీవల బదిలీపై హుజురాబాద్ రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ గతంలో హుజురాబాద్ టౌన్ ఎస్ఐగా పనిచేసి ప్రజల ఆదరణ పొందారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించారని గుర్తుచేశారు. ఇకముందు కూడా ప్రజలకు న్యాయం జరిగేలా, సామాన్యుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాద్ ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇప్పకాయల సాగర్, తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సంఘం సత్యనారాయణ, హెచ్ఆర్సీ రమేశ్, మాడుగుల ఓదెలు, మండల అధ్యక్షుడు నడిగోటి రమేష్, బూర్ల చంద్రమౌళి, మండల ఉపాధ్యక్షుడు కొలిపాక క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శి మామునూరి ప్రవీణ్, ప్రచార కార్యదర్శి పంజాల వెంకటేశ్వర్లు, సొల్లు సల్మోహన్, ఎండీ బాబర్ తదితరులు పాల్గొని సీఐ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సలీం సేవలను కాంగ్రెస్ ఎప్పటికీ మరవదు : తాజుద్దీన్



**జమ్మికుంట టౌన్ మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మొహమ్మద్ సలీం మృతి పార్టీ శ్రేణుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ నెల 4న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సలీం, చికిత్స పొందుతూ మే 14న కన్నుమూశారు.

ఈ నేపథ్యంలో కరీంనగర్ డీసీసీ మైనారిటీ విభాగం చైర్మన్ మొహమ్మద్ తాజుద్దీన్, సలీం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "సలీం కేవలం నాయకుడు మాత్రమే కాదు.. పార్టీ కోసం చివరి వరకు అంకితభావంతో పనిచేసిన నిజమైన కాంగ్రెస్ కార్యకర్త. పార్టీ కష్టకాలంలో కూడా వెనుకడుగు వేయకుండా కాంగ్రెస్ జెండాను భుజాన మోసిన వ్యక్తి" అని భావోద్వేగంగా గుర్తు చేసుకున్నారు.

సలీం మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్న తాజుద్దీన్, వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో మొహమ్మద్ కలీమొద్దీన్, మొహమ్మద్ అజీమ్, లాయఖ్ ఖాద్రీ, ఫజల్ రెహ్మాన్, సలీం పాష తదితరులు పాల్గొన్నారు.

# రెండు వారాలు గడిచినా ధాన్యం డబ్బులు లేవు... ఐకేపీ సెంటర్ నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం



**వేలేరు, మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలోని ఐకేపీ సెంటర్‌లో రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు వారాలు గడిచినా తమ ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని వారు చెబుతున్నారు.

ఈ విషయమై ఐకేపీ సెంటర్ నిర్వాహకులను ప్రశ్నించినప్పటికీ సరైన స్పందన లభించలేదని, పొంతనలేని సమాధానాలు ఇస్తూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

తక్షణమే బకాయి చెల్లింపులు చేయాలని, సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

# బైక్ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు.. ఆలస్యంగా ఫిర్యాదు

**జమ్మికుంట టౌన్ మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండల పరిధిలోని మడిపల్లి గ్రామానికి చెందిన గర్రెపల్లి శ్రీనాథ్ తండ్రి సత్యనారాయణ(25), తన తమ్ముడు గర్రెపల్లి ఉదయ్ కిరణ్(24) ప్రమాదానికి గురైనట్లు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు వివరాల ప్రకారం.. మే 2, 2026న సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో ఉదయ్ కిరణ్ తన ద్విచక్ర వాహనంపై పనిమీద జమ్మికుంటకు వస్తుండగా, బొమ్మల గుడి వద్దకు చేరుకున్న సమయంలో వెనుక నుండి సుదర్శన్ అనే వ్యక్తి తన బైక్‌ను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వచ్చి ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ఉదయ్ కిరణ్ కిందపడిపోగా కుడి కాలి కింద నరాలు తెగడంతో పాటు శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడం ఆలస్యమైనట్లు పేర్కొన్నారు.

# "పల్లెకు వెళ్లొస్తా" అన్న భద్రయ్య.. మృతదేహంగా తిరిగొచ్చాడు



**జమ్మికుంట టౌన్ మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లె-వీణవంక రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. గత వారం రోజులుగా వరుస రోడ్డు ప్రమాదాలతో ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, తాజాగా ఆబాది జమ్మికుంట గ్రామానికి చెందిన పిట్టల భద్రయ్య(50) మృతి చెందడం గ్రామంలో విషాద ఛాయలు నింపింది. స్థానికుల వివరాల ప్రకారం.. రైతులు కిలోమీటర్ల మేర రోడ్డుపై వరి ధాన్యం ఆరబెట్టడంతో వాహనదారులు ఎటు వెళ్లాలో అర్థం కాక ప్రమాదాలకు గురవుతున్నారు. శుక్రవారం ఉదయం "పల్లెకు వెళ్లి వస్తా" అంటూ ఇంటి నుంచి బయలుదేరిన భద్రయ్యను వేగంగా వచ్చిన వ్యాన్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను మొదట వరంగల్‌కు తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. భద్రయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయామని, తమ కుటుంబం రోడ్డున పడిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇప్పటికే ఇదే రహదారిపై ఐదుగురు వరకు ప్రాణాలు కోల్పోయారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు వార్తలు వచ్చినా అధికారులు స్పందించడం లేదని మండిపడుతున్నారు. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టవద్దని రైతులకు సూచించే పరిస్థితి కూడా లేదని వాహనదారులు వాపోతున్నారు. "ఇంకా ఎంతమంది ప్రాణాలు పోతే అధికారులు స్పందిస్తారు..? మా కుటుంబాలను రోడ్డున పడేయొద్దు.. రహదారులపై ధాన్యం ఆరబెట్టకుండా వెంటనే చర్యలు తీసుకోండి" అంటూ బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి.

# విధుల్లో కఠినత్వం.. క్రీడల్లో స్వర్ణ విజయం : ఏసిపి మాధవి

**జమ్మికుంట టౌన్ మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో నిర్వహించిన అఖిల భారతీయ పోలీస్ క్రీడా పోటీల్లో హుజూరాబాద్ ఏసిపి వి. మాధవి టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మాస్టర్ క్రీడాకారులు శనివారం ఆమె కార్యాలయానికి వెళ్లి శాలువాతో సత్కరించి, పూలగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాస్టర్ క్రీడాకారులు మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందించడమే కాకుండా, క్రీడల పట్ల ఆసక్తితో సాధన చేసి జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించడం గర్వకారణమన్నారు.



ఏసిపి మాధవి మహిళలకే కాకుండా యువతకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి మాత్రమే కాకుండా వ్యక్తిగత ప్రతిభను నిరూపించుకునే గొప్ప వేదిక అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ మారేపల్లి మొగిలయ్య, అంతర్జాతీయ క్రీడాకారులు వంతడుపుల రఘు, డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు), మంద జగన్, మామిండ్ల మల్లయ్య పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

**డాక్టర్ పిడమర్తి రవి**



**హైదరాబాద్, మే16 (తెలంగాణ ముచ్చట్లు):** జూన్ 21న హైదరాబాద్‌లోని ఇంద్రపార్క్ వద్ద నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. ఉద్యమకారుల సన్నాహక సమావేశాల్లో భాగంగా శుక్రవారం హైదరాబాద్ రామంతపూర్‌లో తెలంగాణ ఉద్యమకారులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా వంశరాజుల సంఘం నాయకులతో కలిసి తెలంగాణ ఉద్యమ దశలను, ఉద్యమ సమయంలో జరిగిన పరిణామాలను స్మరించుకున్నారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు రావాల్సిన గుర్తింపు, హక్కులు, ఫలాల సాధన కోసం సమ్మేళనం వేదికగా నిలవాలని పేర్కొన్నారు. జూన్ 21న నిర్వహించే సమ్మేళనానికి వేలాదిగా తరలిరావాలని ఉద్యమకారులకు పిలుపునిచ్చారు.

అనంతరం తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిటికెల కృష్ణయ్యను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు నిమ్మల వీరన్న, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, ఇతర తెలంగాణ ఉద్యమకారులు, వంశరాజుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్‌కు భారత సైన్యాధిపతి ఘాటు హెచ్చరిక

- **ఉగ్రవాదానికి మద్దతిస్తే పరిణామాలు తీవ్రం**
- **ఉగ్రవాదంపై రాజీ ఉండదన్న భారత వైఖరి**



**న్యూఢిల్లీ, మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** పాకిస్థాన్ ఉగ్రవాదులకు మద్దతు కొనసాగించి వారిని భారత్‌పైకి ప్రేరేపిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని భారత సైన్యాధిపతి ఉపేంద్ర ద్వివేది ఘాటుగా హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం కొనసాగిస్తే ప్రపంచ చరిత్రలో పాకిస్థాన్‌కు స్థానం ఉండాలా లేదా అన్నది ఆ దేశమే నిర్ణయించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని మానేక్‌షా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ భద్రత విషయంలో భారత్ ఎలాంటి రాజీకి సిద్ధంగా ఉండదని, ఉగ్రవాదాన్ని కఠినంగా ఎదుర్కొంటూనే ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గతంలో చేపట్టిన "సింధూర్ ఆపరేషన్" తరహా పరిస్థితులు మళ్లీ ఏర్పడితే భారత వైఖరి ఎలా ఉంటుందని ప్రశ్నించగా, దీనికి సమాధానంగా ఆయన పాకిస్థాన్‌కు నేరుగా హెచ్చరికలు జారీ చేశారు. దేశ భద్రతకు ముప్పు ఏర్పడితే తగిన చర్యలు తీసుకోవడం కొనసాగుతుందని పేర్కొన్నారు. భారత్‌పై ఉగ్రవాద కార్యకలాపాలు ప్రోత్సహించే శక్తులను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని ఆయన స్పష్టం చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు అవసరమైన ప్రతి చర్య చేపడతామని వెల్లడించారు. గత ఏడాది మే ఏడో తేదీన భారత దళాలు "సింధూర్ ఆపరేషన్" చేపట్టిన విషయం తెలిసిందే. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలపై లక్ష్యబద్ధంగా దాడులు నిర్వహించి వాటిని ధ్వంసం చేశాయి. ఆ తర్వాత పాకిస్థాన్ ప్రతిదాడులకు ప్రయత్నించినప్పటికీ భారత బలగాలు సమర్థంగా తిప్పికొట్టాయి. దాదాపు ఎనభై ఎనిమిది గంటల పాటు ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగగా, అనంతరం మే పదో తేదీన కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది.

# గ్రీన్ గాంధీనగర్ లక్ష్యంపై అమిత్ షా సమీక్ష

- **వృక్షారోపణ పనులపై సమీక్ష సమావేశం**
- **మూడేళ్లలో భారీగా మొక్కల నాటకం**
- **చెరువుల అనుసంధానంపై విస్తృత చర్చ**

**గాంధీనగర్, మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** గాంధీనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో వృక్షారోపణ, చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలు కొత్త గుర్తింపుగా మారాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా నిరంతరంగా చేపడుతున్న పర్యావరణ కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. 'గ్రీన్ లోక్‌సభ - గాంధీనగర్ లోక్‌సభ' సంకల్పంలో భాగంగా కొనసాగుతున్న వృక్షారోపణ కార్యక్రమాలపై అమిత్ షా సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో చేపడుతున్న చర్యల పురోగతిని అధికారులతో చర్చించారు. గత మూడు సంవత్సరాల్లో గాంధీనగర్ లోక్‌సభ పరిధిలో సుమారు ఒకటిన్నర కోట్ల మొక్కలు నాటినట్లు ఆయన వెల్లడించారు. విస్తృత స్థాయిలో చేపట్టిన ఈ కార్యక్రమాల కారణంగా నియోజకవర్గ సగటు ఉష్ణోగ్రతలో రెండు నుంచి మూడు డిగ్రీల వరకు తగ్గుదల నమోదైందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు వృక్షారోపణ అత్యంత అవసరమని, దీర్ఘకాలిక ప్రణాళికలతో చేపడుతున్న కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు మేలు చేస్తాయని అమిత్ షా అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో గాంధీనగర్ లోక్‌సభ పరిధిలోని చెరువుల అనుసంధానంపై కూడా విస్తృతంగా చర్చించారు. నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, సాగునీటి సామర్థ్యం మెరుగుదల వంటి అంశాలపై అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల అభివృద్ధి కలిపి ప్రాంత సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తాయని అమిత్ షా పేర్కొన్నారు. గ్రీన్ గాంధీనగర్ లక్ష్యాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని సూచించినట్లు సమాచారం.

# వైద్య రంగంలో స్వదేశీ ఆవిష్కరణలకు ప్రోత్సాహం

**డెస్క్, మే 16 (తెలంగాణ ముచ్చట్లు):** కేరళలోని తిరువనంతపురం శ్రీ చిత్ర తిరునాళ్ వైద్య విజ్ఞాన, సాంకేతిక సంస్థ నలభై రెండో బ్యాచ్ వార్షిక పట్టాభిషేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూవిజ్ఞాన శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వర్చువల్ విధానంలో హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ కూడా పాల్గొన్నారు. వైద్య పరికరాల తయారీలో స్వదేశీ ఆవిష్కరణలు, తక్కువ వ్యయంతో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేయడంలో ఈ సంస్థ కీలకపాత్ర పోషిస్తోందని జితేంద్ర సింగ్ ప్రశంసించారు. పరిశోధనలను పరిశ్రమలకు అనుసంధానం చేసి సాంకేతికత బదిలీలో కూడా సంస్థ విజయవంతంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

దేశంలో ఆరోగ్య సేవలను మరింత ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంపై కూడా ఈ సందర్భంగా చర్చించారు. ఆరోగ్య సంరక్షణలో సమగ్ర విధానాన్ని అనుసరిస్తూ సంక్షేమం ఆధారిత వైద్య సేవలు, డిజిటల్ ఆరోగ్య వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. వైద్య పరికరాలు, సాధారణ ఔషధాల రంగంలో పరిశోధనలకు ఊతమిచ్చేలా పలు నియంత్రణ సంస్కరణలు చేపడుతున్నట్లు పుణ్య సలిలా శ్రీవాస్తవ పేర్కొన్నారు. పరిశోధన ప్రక్రియలను సులభతరం చేసి వైద్య రంగంలో ఆవిష్కరణలకు మరింత అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇంజినీర్లు, వైద్యులు కలిసి పనిచేస్తూ వైద్య పరికరాల తయారీలో కొత్త ఆవిష్కరణలు తీసుకురావడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో విద్యార్థులు నైతిక విలువలు, మానవత్వం, శాస్త్రీయ దృక్పథాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. ఈ పట్టాభిషేక కార్యక్రమంలో మొత్తం 130 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో పట్టాలు అందుకున్నారు. అత్యున్నత వైద్య విద్య, ప్రజారోగ్యం, పరిశోధన, న్యూరో విజ్ఞాన శాస్త్ర విభాగాలకు సంబంధించిన పలు కోర్సుల విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని నిర్వాహకులు తెలిపారు.




స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు దాటినా , ప్రజాస్వామ్యం అనే మాట గొప్పగా చెప్పుకున్నా నేటికీ ఈ దేశంలో అధికారం కొద్దిమంది అగ్రవర్ణ, ధనవంత వర్గాల చేతుల్లోనే పడి ఉంది. శాసనసభలు, న్యాయస్థానాలు, పాలనా యంత్రాంగం, మీడియా, విద్యాసంస్థలు అన్ని చోట్లా అదే మొహాలు, అదే వంశాలు, అదే కులాలు. బహుజనులు ఓట్లు వేస్తారు, కానీ అధికారంలో వారి ప్రతినిధులు ఉండరు. ఓటు బ్యాంకుగా వాడుకొని, ఎన్నికలు అయిన తర్వాత తోసిపుచ్చే ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా బహుజన గళం బలంగా వినిపించాలి.అంబేద్కర్ అన్నారు "రాజకీయ అధికారం అనేది అన్ని సమస్యలకు మాస్టర్ కీ." ఆ మాట ఈనాటికీ అక్షరసత్యం. రాజకీయ అధికారం లేనిదే ఆర్థిక న్యాయం రాదు, సామాజిక సమానత్వం నెలకొనదు, మానవ గౌరవం నిలబడదు. అందుకే బహుజన రాజాధికారం అనేది కేవలం ఒక నినాదం కాదు అది ఒక విముక్తి మార్గం. బహుజనుల గుండెల్లో ఈ ఆకాంక్ష రగిలినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం దేశంలో వెల్లివిరుస్తుంది. అది కేవలం కొద్దిమంది గుత్తాధిపత్యం కాదు, యావత్ సమాజపు భాగస్వామ్యం.

పూర్వం బహుజనులను గొలుసులతో కట్టేవారు. నేడు వారిని చట్టాల పేరిట, అప్పుల పేరిట, కులం పేరిట, మతం పేరిట బంధిస్తున్నారు. శారీరక హింస తగ్గిందేమో కానీ మానసిక హింస, ఆర్థిక హింస, సాంస్కృతిక హింస వందింతలు పెరిగింది. ఈ వివక్ష ఆధునిక రూపాలు సంతరించుకుని, సమాజంలో మరింత సూక్ష్మంగా చొరబడుతోంది. పైకి అంతా సమానంగా కనిపిస్తున్నా, లోలోపల అసమానతల కోరలు అలాగే ఉన్నాయి.నేటికీ దళిత యువకుడు పై కులపు అమ్మాయిని ప్రేమించినందుకు చంపబడుతున్నాడు. నేటికీ ఆదివాసీ స్త్రీ అడవి హక్కు కోసం అడిగినందుకు తూటాలు తింటోంది. నేటికీ వెనుకబడిన తరగతి విద్యార్థి నిర్లక్ష్యానికి గురై నిరాశతో ప్రాణం తీసుకుంటున్నాడు. ఇవి ఒంటరి సంఘటనలు కాదు ఇవి వ్యవస్థీకృత దౌర్జన్యం యొక్క వ్యక్తీకరణలు. ఈ హింస వెనుక శతాబ్దాల నాటి అహంకారం, అధికారాన్ని వదులుకోలేని స్వార్థం స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాలకవర్గం ఈ దౌర్జన్యాన్ని రెండు రకాలుగా సమర్థిస్తుంది మొదటిది, ఇది జరగలేదు అని నిరాకరించడం; రెండవది, ఇది వారి తప్పే అని బాధితుణ్ణే నేరస్తుడిగా చిత్రించడం. ఈ రెండు అబద్ధాలకూ బహుజన సమాజం ఇక సమాధానం చెప్పకూడదు తిరస్కరించాలి. ఘర్జించాలి. న్యాయం కోసం ప్రశ్నించే ప్రతి గళాన్ని అణచివేయాలని చూసే పాలకుల కుట్రలను తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైంది. భారత సమాజంలో అణిచివేత అనేది కేవలం శారీరకంగా మాత్రమే జరగడం లేదు. అది సాంస్కృతికంగా, భాషాపరంగా, విద్యాపరంగా కూడా నిరంతరం కొనసాగుతోంది. బహుజనుల చరిత్రను పాఠ్యపుస్తకాల నుండి తొలగించారు. వారి మహానుభావులను గుర్తించలేదు. వారి కళలను, సంస్కృతిని నీచంగా చూపించారు. ఈ దేశ సంస్కృతికి అసలైన వారసులు శ్రమజీవులే అయినప్పటికీ, వారి శ్రమను, సృజనాత్మకతను తక్కువ చేసి చూపే ప్రయత్నం నిరంతరం సాగుతోంది.పూలే అన్నారు విద్యను నేర్చుకో, సంఘటితం అవ్వు, పోరాడు. ఈ మూడు అడుగులూ ఈరోజు మరింత అవసరం. ఎందుకంటే అణిచివేత ఆగడం లేదు పైగా నయవంచన రూపాలు తీసుకుంటోంది. జ్ఞానమే నిజమైన ఆయుధమని గ్రహించి, బహుజన బిడ్డలు విద్యా రంగాల్లో రాణించాల్సి ఉంది. కేవలం డిగ్రీల కోసం కాకుండా, సమాజాన్ని మార్చే ప్రత్యామ్నాయ ఆలోచనా దృక్పథాన్ని అలవర్చుకోవాలి.ఈ దేశ ఆర్థిక వ్యవస్థ ఎవరిపై నిలుచుని ఉంది? వ్యవసాయ కూలీల చేతులపై, నిర్మాణ శ్రమికుల భుజాలపై, చేనేత కార్మికుల వేళ్ళపై, పారిశుద్ధ్య కార్మికుల జీవితాలపై. వీరంతా ఎవరు? వీరిలో 90 శాతం బహుజనులే. దేశ జీడీపీని పెంచేది, సంపదను సృష్టించేది వీరి శ్రమే. ఈ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన శ్రమజీవుల నిజమైన సామాజిక, ఆర్థిక పరిస్థితులను గమనిస్తే ఒక తీవ్రమైన నిరాశ వ్యక్తమవుతుంది. రేయింబవళ్లు పొలాల్లో చెమటోడ్చి, పంటలు పండించి దేశానికి అన్నం పెట్టే వ్యవసాయ కూలీలు నేడు అప్పుల ఊబిలో కూరుకుపోయి, చివరకు ఆత్మహత్యల శరణు జొచ్చుకుంటున్నారు. ఆధునిక నగరాలను, ఆకాశహర్మ్యాలను మరియు అద్భుతమైన భవనాలను తమ రక్తాన్ని చమటగా మార్చి నిర్మించే నిర్మాణ శ్రమికులు మాత్రం కనీస వసతులు కూడా లేని చిన్న చిన్న గుడిసెల్లో, దుర్భరమైన పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. ఇక సమాజాన్ని నిరంతరం శుభ్రంగా ఉంచుతూ అందరి ఆరోగ్యాన్ని కాపాడే పారిశుద్ధ్య కార్మికులు నేటికీ కనీస సామాజిక గౌరవానికి నోచుకోకపోగా, నిరంతరం రక్షణ లేని పనుల వల్ల తీవ్రమైన అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఈ విధంగా సమాజంలో అత్యంత కీలకమైన సేవలు అందిస్తున్న వర్గాల శ్రమ దోపిడీకి గురవుతూ, కన్నీళ్లే వారి జీవితాలుగా మిగిలిపోతున్నాయి.కానీ ఈ శ్రమ ఫలం వారికి చేరుతోందా? కార్పొరేట్ సంస్థలు వేల కోట్ల లాభాలు పెట్టుకుంటున్నాయి. పెద్ద పెద్ద పరిశ్రమాధిపతులకు వేల కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేస్తున్నారు. మరో వైపు రైతు అప్పు తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటున్నాడు. కూలీ రోజు రోజుకూ కనీస వేతనానికి నోచుకోక అలమటిస్తున్నాడు. ఇది యాదృచ్ఛికం కాదు ఇది వ్యవస్థీకృత దోపిడీ. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై, శ్రమించేవాడు నిరుపేదగా మిగిలిపోయే దుస్థితి మారాలి. రిజర్వేషన్ల మీద అరుస్తారు కానీ, కార్పొరేట్ రిజర్వేషన్ల మీద మాట్లాడరు. ఆస్తి హక్కుల మీద, వారసత్వ సంపద మీద నోరు మెదపరు. మెరిట్ అంటారు కానీ మెరిట్ కూడా డబ్బు, సౌకర్యం, వంటి నేపథ్యం ఉన్నవారికే దక్కుతుంది అనే నగ్న సత్యాన్ని దాచిపెట్టాలని చూస్తారు. ఈ అసమానత అంత సులభంగా చెరిగిపోదు దానికి చట్టాలు మారాలి, వ్యవస్థలు మారాలి, అధికారం మారాలి.చరిత్రలో ఏ రాజు అయినా సరే, ఏ పాలకవర్గం అయినా సరే తమ అధికారాన్ని నిలుపుకోవడానికి మూడు ఆయుధాలు వాడుతారు: భయం, అజ్ఞానం, మరియు విభజన. ఈ మూడూ నేడు కూడా అదే రీతిలో వాడబడుతున్నాయి. ఒక దళిత మేధావి లేదా నేతను అవమానపర్చడం ద్వారా మిగతా వారిలో భయాన్ని కలిగిస్తారు. చట్టాలను దుర్వినియోగం చేసి పోరాడేవారిని జైళ్ళలో వేస్తారు. సీమాంధ్ర, తెలంగాణ, గుజరాత్, ఉత్తర ప్రదేశ్ ఎక్కడైనా కదలే బహుజన నేత అరెస్టు అవుతున్నాడు, హత్య చేయబడుతున్నాడు, అదృశ్యమవుతున్నాడు. విద్యపై పట్టు నిలుపుకుంటే బహుజనులు ఎప్పటికీ ప్రశ్నించలేరు అని పాలకులకు తెలుసు. అందుకే ప్రభుత్వ పాఠశాలలు నాశనమవుతున్నాయి, విశ్వవిద్యాలయాలు అమ్మబడుతున్నాయి, ప్రైవేటు విద్య ధర చేయి అందనంత ఎత్తుకు ఎక్కుతోంది. జ్ఞానాన్ని వ్యాపారంగా మార్చి పేదలకు దూరం చేస్తున్నారు.హిందూముస్లిం, ఓబీసీదళిత్, ఆంధ్రాతెలంగాణ అంటూ బహుజన సమాజాన్ని ముక్కలు ముక్కలు చేస్తున్నారు. ఒకే నొప్పి అనుభవించే వారిని పరస్పరం తన్నుకునేలా చేస్తున్నారు. ఇది పాత "Divide and Rule" వ్యూహమే కొత్త ముసుగులో. మన మధ్య ఉన్న విభేదాలను వాడుకుని వారు పీఠాలు ఎక్కుతున్నారు.నిరాశతో కూర్చుంటే నాశనమే. కర్తవ్యాన్ని గుర్తుంచుకుంటేనే విముక్తి. అందుకే ఈ క్షణం నుండే కొన్ని నిర్ణయాత్మక అడుగులు వేయాలి. మొదటి అడుగు బహుజన సమాజంలో ప్రతి ఇంట్లో, ప్రతి పల్లెలో, ప్రతి వాడలో అంబేద్కర్ సిద్ధాంతం వ్యాపించాలి. చరిత్రను తెలుసుకోవాలి. మన మహానుభావులను గుర్తించాలి. పూలే, పెరియార్, బిర్సా ముండా, శ్రీమతి సావిత్రీబాయి పూలే, కంచెయ్య వారి మాటలు యువతకు చేరాలి. అప్పుడే ఆత్మగౌరవం పెరుగుతుంది.రెండవ అడుగు ఒంటరి గళం బలహీనంగా ఉంటుంది. వేలమంది గళాలు కలిస్తే పాలకులు భయపడతారు. కులం పేరిట చీలకుండా, మతం పేరిట విడిపోకుండా అన్ని బహుజన వర్గాలూ ఒక గొడుగు కింద సంఘటితం కావాలి. మన ఐక్యతే మన అతిపెద్ద శక్తి అని చాటాలి.మూడవ అడుగు ఓటు హక్కు అనేది కేవలం ఒక హక్కు కాదు అది ఒక ఆయుధం. ఆ ఆయుధాన్ని సరిగ్గా వాడాలి. జాతీయ పార్టీల కోసం గుడ్డిగా ఓటు వేయడం ఆపాలి. బహుజన ప్రయోజనాలకు నిజంగా కట్టుబడిన నేతలను ముందుకు రావాలి స్థానిక సంస్థల నుండి పార్లమెంటు వరకు బహుజనులు అభ్యర్థులుగా నిలబడాలి. పాలకులుగా మారాలి.నాల్గవ అడుగు వ్యాపారం, వ్యవసాయం, పరిశ్రమలలో బహుజన నెట్‌వర్క్‌లు ఏర్పడాలి. ఒకడు కొనాలి, ఒకడు అమ్మాలి ఈ నినాదం ఆర్థిక సంఘటనకు పునాది. పరస్పర సహాయం, సహకారం ద్వారా ఆర్థిక బలం పెరగాలి. మన ఆర్థిక వనరులను మనమే సృష్టించుకోవాలి. ప్రతి యుగంలో అణగారిన వర్గాలు ఒకప్పుడు లేచాయి. ఫ్రెంచ్ విప్లవం జరిగింది. అమెరికాలో నల్లజాతీయుల హక్కుల ఉద్యమం జరిగింది. మహాద్ సత్యాగ్రహం జరిగింది. మనదేశంలోనే బాబాసాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలో బహుజనులు సంవిధానాన్ని రచించారు. అది చరిత్ర. ఇప్పుడు మీరు రాయవలసిన చరిత్ర మీ ముందు ఉంది. మీ కలాలను, గళాలను సిద్ధం చేసుకోండి. బానిస సంకెళ్ళు తమంత తాముగా తెగవు. వాటిని తెంచాలంటే చేతులు, బుద్ధి, మరియు సంకల్పం కలసి పని చేయాలి. భయపడకండి. అలసిపోకండి. ఆగిపోకండి. నిరంతర పోరాటమే విముక్తికి ఏకైక మార్గం.బహుజన రాజాధికారం అనేది ఒక కల కాదు అది మన హక్కు. అది మన వారసత్వం. అది మన గమ్యం. ఈ ప్రయాణంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదు.కదలండి ఇప్పుడే కదలండి!ఈ దేశం మారాలంటే మీరు మారాలి. వ్యవస్థ కదలాలంటే మీరు ముందు కదలాలి. సంకెళ్ళు తెగాలంటే ఒక్కో చేయి ముందుకు రావాలి. ఒక్క గళం నిలబడితే చాలదు వేల గళాలు వినిపించాలి. మొక్కలు నాటిన చోట అడవులు పెరుగుతాయి ధైర్యం నాటిన చోట విప్లవాలు పూస్తాయి. రాబోయే కాలం మనదే, సాధించుకుందాం మన అధికారాన్ని!

జై భీమ్! జై పూలే! జై బహుజన్!

**"స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు దాటినా అధికారం కొద్దిమంది చేతుల్లోనే ఉండిపోగా, దేశ సంపదను సృష్టించే 90 శాతం బహుజన శ్రమజీవులు నేటికీ వ్యవస్థీకృత సామాజిక, ఆర్థిక వివక్షకు గురవుతున్నారు.ఈ శతాబ్దాల నాటి అణచివేతకు, విభజన రాజకీయాలకు చరమగీతం పాడాలంటే జ్ఞానమే ఆయుధంగా పూలే-అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్ళాలి. ఒంటరి గళాలను విడిచి బహుజన సమాజమంతా ఒకే తాటిపై సంఘటితమై, ఓటు హక్కును ఆయుధంగా మలచుకుని శాసనసభల నుండి పార్లమెంట్ వరకు సామాజిక సమానత్వాన్ని సాధించడమే లక్ష్యంగా కదలాలి; కొద్దిమంది గుత్తాధిపత్యాన్ని తిప్పికొడుతూ యావత్ సమాజ భాగస్వామ్యంతో కూడిన "బహుజన రాజాధికారం" సాధించుకున్నప్పుడే ఈ దేశంలో నిజమైన ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తుంది."**



- డా .సూర్యదేవర రామకృష్ణ

# ఎస్‌బీఐ ఎఫ్‌డీలపై ఆకర్షణీయ వడ్డీ




సురక్షితమైన పెట్టుబడులతో స్థిరమైన ఆదాయం పొందాలనుకునే వారికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎఫ్‌డీ పథకాలు మంచి ఎంపికగా మారుతున్నాయి. ముఖ్యంగా దీర్ఘకాలిక ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలపై బ్యాంకు అందిస్తున్న అధిక వడ్డీ రేట్లు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ఎస్‌బీఐ వివిధ కాలపరిమితుల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 3.05 శాతం నుంచి 7.15 శాతం వరకు వడ్డీ అందిస్తోంది. 7 రోజుల నుంచి ప్రారంభమయ్యే స్వల్పకాలిక ఎఫ్‌డీలపై 3.05 శాతం నుంచి 3.65 శాతం వరకు వడ్డీ లభిస్తోంది.46 రోజుల నుంచి 179 రోజుల కాలపరిమితి గల డిపాజిట్లపై 4.90 శాతం నుంచి 5.50 శాతం వరకు వడ్డీ అందిస్తున్నారు. అలాగే 180 రోజుల నుంచి 210 రోజుల వరకు ఉన్న ఎఫ్‌డీలపై 5.65 శాతం నుంచి 6.25 శాతం వరకు రాబడి లభిస్తోంది.దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టేవారికి 5 నుంచి 10 సంవత్సరాల కాలపరిమితి గల ఎఫ్‌డీలు మరింత ప్రయోజనకరంగా మారాయి. ఈ విభాగంలో బ్యాంకు 6.05 శాతం నుంచి 7.15 శాతం వరకు వడ్డీ రేట్లను అందిస్తోంది. సురక్షితమైన, స్థిరమైన ఆదాయం కోరుకునే వారికి ఇవి మంచి పెట్టుబడి అవకాశాలుగా ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఒక సాధారణ ఖాతాదారుడు 6 సంవత్సరాల ఎఫ్‌డీ పథకంలో రూ.3 లక్షలు పెట్టుబడి పెడితే మెచ్యూరిటీ సమయంలో మొత్తం రూ.4,30,120 లభిస్తాయి. ఇందులో సుమారు రూ.1,30,120 వడ్డీ రూపంలో వస్తుంది. అదే పథకంలో సీనియర్ సిటిజన్లు రూ.3 లక్షలు డిపాజిట్ చేస్తే మెచ్యూరిటీ సమయంలో మొత్తం రూ.4,56,276 పొందుతారు. ఇందులో సుమారు రూ.1,56,276 వడ్డీగా లభిస్తుంది. అత్యంత వయోవృద్ధులకు మరింత ప్రయోజనం లభిస్తోంది. వారు రూ.3 లక్షల ఎఫ్‌డీపై 6 సంవత్సరాల తర్వాత మొత్తం రూ.4,58,974 పొందే అవకాశం ఉంది. అందులో రూ.1,58,974 వరకు వడ్డీ రూపంలోనే లభిస్తుంది. పదవీ విరమణ తర్వాత స్థిరమైన ఆదాయం కోసం చాలామంది వృద్ధులు ఎఫ్‌డీల వైపు మొగ్గు చూపుతున్నారని, భద్రతతో కూడిన పెట్టుబడి కావడం వల్ల ఎస్‌బీఐ ఎఫ్‌డీలకు ఇంకా మంచి ఆదరణ కొనసాగుతోందని బ్యాంకింగ్ రంగ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పర్యాటకమే ప్రగతి మార్గం

- **స్థానిక ఉపాధికి కొత్త దారి చూపాలి**
- **పర్యాటక రంగంలో అపార అవకాశాలు**
- **గ్రామీణ ప్రాంతాలకు చేరని అభివృద్ధి**
- **ప్రభుత్వ చర్యలతో ఉపాధికి ఊతం ఇవ్వాలి**

దేశంలో పర్యాటక రంగానికి అపార అవకాశాలు ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రకృతి అందాలు, చారిత్రక కట్టడాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, సాంస్కృతిక వైవిధ్యం ఉన్నప్పటికీ అనేక ప్రాంతాలు ఇంకా పర్యాటక పటంలో సరైన గుర్తింపు పొందలేదు. పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తే స్థానిక ఉపాధి అవకాశాలు భారీగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో పర్యాటక కేంద్రాలు ఉన్నప్పటికీ సరైన మౌలిక సదుపాయాల కొరత ప్రధాన సమస్యగా మారింది. రహదారులు, తాగునీరు, పరిశుభ్రత, వసతి సదుపాయాలు, రవాణా వ్యవస్థలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని పర్యాటకులు చెబుతున్నారు. సరైన సదుపాయాలు లేకపోవడం వల్ల పలు ప్రాంతాలు ఆశించిన స్థాయిలో సందర్శకులను ఆకర్షించలేకపోతున్నాయి. ప్రస్తుతం పర్యాటకాభివృద్ధి ప్రధానంగా కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతోందనే అభిప్రాయాలు ఉన్నాయి. పెద్ద నగరాలు, ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలపై ఎక్కువ దృష్టి ఉండగా గ్రామీణ ప్రాంతాలు వెనుకబడుతున్నాయి. గ్రామాల్లో ప్రకృతి అందాలు, స్థానిక సంస్కృతి, సంప్రదాయ కళలకు ప్రత్యేక గుర్తింపు కల్పిస్తే పర్యాటక రంగం విస్తరించే అవకాశాలు ఉన్నాయి. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక ప్రజలకు నేరుగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. చిన్న వ్యాపారాలు, హోటళ్లు, రవాణా సేవలు, స్థానిక కళలు, ఆహార కేంద్రాలు వంటి రంగాలు లాభపడతాయి. ముఖ్యంగా యువతకు స్వగ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తే వలసలను తగ్గించే అవకాశం కూడా ఉంటుంది. ప్రస్తుతం ఉద్యోగాల కోసం నగరాలకు వెళ్తున్న యువత తమ ప్రాంతాల్లోనే ఉపాధి పొందే పరిస్థితులు ఏర్పడవచ్చు. ఇందుకోసం ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. పర్యాటక రంగంలో మహిళలకు కూడా అనేక అవకాశాలు ఉన్నాయి. స్వయం సహాయక సంఘాల ద్వారా స్థానిక ఉత్పత్తులు, సంప్రదాయ వస్తువులు, ఆహార పదార్థాల విక్రయాలకు ప్రోత్సాహం ఇవ్వవచ్చు. దీనివల్ల మహిళల ఆర్థిక స్వావలంబనకు కూడా మద్దతు లభించే అవకాశం ఉంటుంది. పర్యాటక ప్రాంతాల ప్రచారం విషయంలో కూడా మరింత దృష్టి అవసరమని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అనేక అందమైన ప్రాంతాలు ఉన్నప్పటికీ సరైన ప్రచారం లేకపోవడం వల్ల అవి ప్రజలకు తెలియడం లేదు. ఆధునిక సాంకేతిక వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాల్సిన అవసరం ఉంది. అభివృద్ధి పేరుతో ప్రకృతి దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. స్థిరమైన పర్యాటక విధానాలతో మాత్రమే దీర్ఘకాల ప్రయోజనాలు సాధ్యమవుతాయి.

పర్యాటక రంగాన్ని కేవలం విహారయాత్రల కోణంలో కాకుండా ఆర్థికాభివృద్ధి సాధనంగా చూడాల్సిన అవసరం ఉంది. స్థానిక యువతకు శిక్షణ, మార్గదర్శక సేవలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందిస్తే రంగం మరింత బలపడే అవకాశం ఉంటుంది. దేశంలో పర్యాటక రంగానికి ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు రావాల్సిన అవసరం ఉంది. మౌలిక సదుపాయాలు, ప్రచారం, స్థానిక భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇస్తే పర్యాటక రంగం అభివృద్ధి చెందడమే కాకుండా స్థానిక ఉపాధికి కూడా బలమైన ఊతం లభించే అవకాశం ఉంది.

## రక్తపోటుపై అవగాహనే ఆరోగ్యానికి రక్షణ

ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది మే 17న ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రజల్లో అధిక రక్తపోటు సమస్యపై అవగాహన పెంచడం, దాని ప్రమాదాలను తెలియజేయడం, ఆరోగ్యంపై శ్రద్ధ పెంచడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. ప్రపంచ ఆరోగ్య రంగంలో ఇది అత్యంత ప్రాధాన్యమైన ఆరోగ్య అవగాహన దినాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. అధిక రక్తపోటు అనేది రక్తం రక్తనాళాల గోడలపై సాధారణ స్థాయి కంటే ఎక్కువ ఒత్తిడిని కలిగించే పరిస్థితి. ఇది ప్రారంభ దశల్లో పెద్దగా లక్షణాలు కనిపించకుండా నెమ్మదిగా శరీరంపై ప్రభావం చూపుతుంది. అందుకే వైద్య నిపుణులు దీనిని నిశ్శబ్ద ప్రమాదంగా పేర్కొంటారు. చాలా మంది తమకు రక్తపోటు ఉందనే విషయాన్ని ఆలస్యంగా తెలుసుకుంటారు. తరచుగా పరీక్షలు చేయించుకోకపోవడం వల్ల సమస్య గుర్తించడంలో ఆలస్యం జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చిన తర్వాతే రక్తపోటు బయటపడుతుంది.తలనొప్పి, అలసట, తలతిరగడం, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కొన్నిసార్లు కనిపించవచ్చు.



అయితే అందరిలోనూ ఈ లక్షణాలు ఒకేలా ఉండవు. అందువల్ల లక్షణాలపై ఆధారపడకుండా క్రమం తప్పకుండా రక్తపోటు పరీక్ష చేయించుకోవడం అవసరం. నేటి ఆధునిక జీవనశైలిలో పెరిగిన పని ఒత్తిడి కూడా రక్తపోటు సమస్యకు ఒక ప్రధాన కారణంగా మారుతోంది. మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉండటం వల్ల శరీరంలోని హార్మోన్ల వ్యవస్థపై ప్రభావం పడుతుంది. దీని కారణంగా రక్తపోటు పెరిగే అవకాశం ఉంటుంది. వ్యాయామం చేయకపోవడం, శారీరక శ్రమ తగ్గిపోవడం కూడా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గంటల తరబడి ఒకేచోట కూర్చోవడం, కదలికలు తగ్గిపోవడం వల్ల ఊబకాయం పెరుగుతోంది. ఇది రక్తపోటుకు కారణమయ్యే ప్రధాన అంశాల్లో ఒకటిగా భావిస్తున్నారు.

# సమాచార యుగంలో అనుసంధానమే అసలైన శక్తి

- **సాంకేతిక ప్రపంచం కొత్త దిశగా**
- **సమాచార సమానత్వం సమాజ అభివృద్ధికి అవసరం**

ప్రపంచ టెలికమ్యూనికేషన్ మరియు సమాచార సమాజ దినోత్సవం కేవలం ఒక సాంకేతిక దినోత్సవం మాత్రమే కాదు. ప్రపంచం ఎలా మారిపోయిందో, సమాచార వ్యవస్థలు మానవ జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేశాయో గుర్తు చేసే సందర్భం. ఒకప్పుడు దేశాల మధ్య దూరాలు, భాషలు, భౌగోళిక పరిమితులు పెద్ద అడ్డంకులుగా ఉండేవి. కానీ నేడు సమాచార సాంకేతికత ఆ గీతలన్నింటినీ చెరిపేసి ప్రపంచాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. మానవ చరిత్రలో ప్రతి యుగానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. వ్యవసాయ విప్లవం, పారిశ్రామిక విప్లవం తరువాత ఇప్పుడు ప్రపంచం సమాచార విప్లవ దశలో కొనసాగుతోంది. ప్రస్తుతం సమాచారం ఒక అవసరం మాత్రమే కాదు, అది శక్తిగా మారింది. ఎవరి చేతిలో సమాచారం ఉంటే వారి చేతిలో అవకాశాలు ఉంటాయి. అందుకే ఆధునిక సమాజంలో



సమాచార ప్రాప్తి ఒక హక్కుగా మారుతోంది. ఒకప్పుడు ఉత్తరం రాసి సమాధానం కోసం రోజులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యక్తితో కొన్ని క్షణాల్లో మాట్లాడే పరిస్థితి ఏర్పడింది. విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యాపారం, పాలన, ఉపాధి వంటి ప్రతి రంగంలో సమాచార సాంకేతికత తన ముద్ర వేసింది. జీవితం వేగవంతం కావడంలో ఈ మార్పుల పాత్ర ఎంతో ఉంది. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ సౌకర్యాలు విస్తరించడంతో ప్రజల జీవన విధానం పూర్తిగా మారిపోయింది. ఒక చిన్న మొబైల్ పరికరం ఇప్పుడు బ్యాంకు, పాఠశాల, కార్యాలయం, సమాచార కేంద్రంగా మారిపోయింది. ప్రభుత్వ సేవలు ప్రజల గుమ్మానికి చేరుతున్నాయి. విద్యార్థులు ప్రపంచ స్థాయి విద్యను ఇంట్లోనే పొందుతున్నారు. ఈ మార్పు నిజంగా విశేషమే. అయితే ఈ అభివృద్ధి అందరికీ సమానంగా చేరుతోందా అనే ప్రశ్న కూడా ముఖ్యమే. ఇంకా అనేక గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన సమాచార సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. డిజిటల్ సౌకర్యాల కొరత వల్ల చాలా మంది అవకాశాలను కోల్పోతున్నారు. నగరాలకు లభిస్తున్న సాంకేతిక అవకాశాలు గ్రామాలకు చేరకపోతే సమాన అభివృద్ధి సాధ్యం కాదు. సమాచార సమాజం అంటే కేవలం అంతర్జాలం ఉండడం కాదు. ప్రతి వ్యక్తికి జ్ఞానం, సేవలు, అవకాశాలు చేరడం కూడా అవసరం. ఒక విద్యార్థికి చదువు అందకపోతే, ఒక రైతుకు అవసరమైన సమాచారం చేరకపోతే, ఒక పౌరుడికి ప్రభుత్వ సేవలు అందకపోతే డిజిటల్ అభివృద్ధి అసంపూర్ణంగానే ఉంటుంది. అందుకే సమాచార సమానత్వం అనేది అత్యంత ముఖ్యమైన అంశం. సాంకేతిక అభివృద్ధితో పాటు కొన్ని సవాళ్లు కూడా ముందుకొస్తున్నాయి. తప్పుడు సమాచారం వ్యాప్తి, వ్యక్తిగత గోప్యత సమస్యలు, అంతర్జాల నేరాలు, డిజిటల్ మోసాలు వంటి అంశాలు పెరుగుతున్నాయి. సమాచారం ఎంత వేగంగా చేరుతోందో, అంతే వేగంగా అసత్యాలు కూడా వ్యాపిస్తున్నాయి. ఇది సమాజంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు, స్వయంచాలక వ్యవస్థలు, డిజిటల్ వేదికలు మరింత విస్తరిస్తున్నాయి. భవిష్యత్తులో మన జీవితంలో సమాచార వ్యవస్థల పాత్ర మరింత పెరగడం ఖాయం. అయితే సాంకేతికత మనిషికి సేవ చేయాలి గానీ, మనిషి సాంకేతికతకు బానిసగా మారకూడదు. ఈ సరిహద్దును గుర్తించడం అత్యంత అవసరం. ప్రపంచ టెలికమ్యూనికేషన్ మరియు సమాచార సమాజ దినోత్సవం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది. అభివృద్ధి అనేది కేవలం కొత్త పరికరాలు రావడంలో లేదు. ఆ సాంకేతికత వల్ల సమాజంలోని చివరి వ్యక్తికి కూడా ప్రయోజనం కలగాలి. అందరికీ సమాన అవకాశాలు కల్పించే విధంగా సాంకేతికతను ఉపయోగించాలి. సమాచారం అనేది నేటి ప్రపంచంలో కొత్త సంపదగా మారింది. దానిని బాధ్యతతో వినియోగించడం, సమాజ ప్రయోజనాలకు ఉపయోగించడం, అందరికీ అందుబాటులో ఉంచడం మనందరి బాధ్యత. అనుసంధానమైన ప్రపంచం నిజమైన అభివృద్ధి దిశగా నడవాలంటే సాంకేతికతకు మానవ విలువలు జత కావాలి. అప్పుడే సమాచార యుగం తన అసలు లక్ష్యాన్ని చేరుకున్నట్టవుతుంది. ఈ సరిహద్దును గుర్తించడం అత్యంత అవసరం.

ప్రపంచ టెలికమ్యూనికేషన్ మరియు సమాచార సమాజ దినోత్సవం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది. అభివృద్ధి అనేది కేవలం కొత్త పరికరాలు రావడంలో లేదు. ఆ సాంకేతికత వల్ల సమాజంలోని చివరి వ్యక్తికి కూడా ప్రయోజనం కలగాలి. అందరికీ సమాన అవకాశాలు కల్పించే విధంగా సాంకేతికతను ఉపయోగించాలి. సమాచారం అనేది నేటి ప్రపంచంలో కొత్త సంపదగా మారింది. దానిని బాధ్యతతో వినియోగించడం, సమాజ ప్రయోజనాలకు ఉపయోగించడం అందరికీ అందుబాటులో ఉంచడం మనందరి బాధ్యత. అనుసంధానమైన ప్రపంచం నిజమైన అభివృద్ధి దిశగా నడవాలంటే సాంకేతికతకు మానవ విలువలు జత కావాలి. అప్పుడే సమాచార యుగం తన అసలు లక్ష్యాన్ని చేరుకున్నట్టవుతుంది.

# అమెజాన్‌పై వినియోగదారుల దావా

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల వ్యవహారం ఇప్పుడు మరోసారి సంచలనంగా మారింది. ట్రంప్ చట్టవిరుద్ధంగా విధించిన సుంకాల కారణంగా వస్తువుల ధరలు పెరిగి తమపై అదనపు భారం పడిందని ఆరోపిస్తూ వినియోగదారులు ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్‌పై సామూహిక దావా వేశారు. సియాటిల్ ఫెడరల్ కోర్టులో దాఖలైన ఈ వ్యాజ్యం అమెరికాలో తీవ్ర చర్చకు దారితీసింది. వినియోగదారుల ఆరోపణల ప్రకారం, ట్రంప్ విధించిన భారీ సుంకాల వల్ల దిగుమతి వస్తువుల ధరలు పెరిగాయి. ఆ అదనపు భారాన్ని అమెజాన్ నేరుగా వినియోగదారులపై మోపిందని వారు పేర్కొన్నారు. అనంతరం అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్ సుంకాలను చట్టవిరుద్ధమని ప్రకటించినప్పటికీ, అమెజాన్ మాత్రం ప్రభుత్వానికి చెల్లించిన సుంకాల రీఫండ్‌ను వినియోగదారులకు తిరిగి ఇవ్వలేదని దావాలో ఆరోపించారు.అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టాన్ని ఉపయోగించి ట్రంప్ విధించిన సుంకాలు తన అధికార పరిధికి మించినవని అమెరికా సుప్రీంకోర్టు గతంలో 6-3 మెజారిటీతో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు తర్వాత అనేక కంపెనీలు ప్రభుత్వంనుంచి బిలియన్ల డాలర్ల రీఫండ్‌లు కోరడం ప్రారంభించాయి. అయితే అమెజాన్ మాత్రం ఆ మార్గాన్ని ఎంచుకోలేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. "అధ్యక్షుడి మన్ననలు పొందేందుకు అమెజాన్ వినియోగదారుల డబ్బును ఉపయోగించింది. ఇప్పటికే చెల్లనివిగా ప్రకటించిన సుంకాల భారాన్ని కస్టమర్లపై మోపడం అన్యాయం" అని వ్యాజ్యంలో పేర్కొన్నారు. అమెజాన్ చర్యలు వాషింగ్టన్ రాష్ట్ర వినియోగదారుల రక్షణ చట్టాలను ఉల్లంఘించాయని కూడా దావాలో ఆరోపించారు. ఇదే తరహాలో ఇప్పటికే కాస్ట్‌కో, నైక్, ఫెడెక్స్ వంటి సంస్థలపై కూడా వినియోగదారులు కేసులు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే వస్తువులను దిగుమతి చేసుకున్న కంపెనీలకు మాత్రమే ప్రభుత్వ రీఫండ్ వర్తిస్తుందని, వినియోగదారులు నేరుగా సుంకాల వాపసు కోరలేరని తాజా వ్యాజ్యంలో ప్రస్తావించారు. ఇంకా 2025 ఏప్రిల్‌లో ఒక ఉత్పత్తి ధరలో సుంకాల వాటా ఎంత ఉందో వినియోగదారులకు చూపించాలని అమెజాన్ యోచించిందని, ఆ సమయంలో వైట్ హౌస్ నుంచి వ్యతిరేకత ఎదురైందని వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఈ కేసుపై అమెజాన్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.






# ఇనార్బిట్ మాల్‌లో వేసవి సందడి

నగరంలోని కుటుంబాలకు, చిన్నారులకు ఈ వేసవి సెలవుల్లో వినోదాన్ని అందించేందుకు సైబరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. 'ది గ్రేట్ సమ్మర్ ప్లేగ్రౌండ్' పేరుతో క్రీడలు, వినోదం, సృజనాత్మకతను కలగలిపిన ఈ వేడుకలు నెల రోజుల పాటు సందర్శకులను అలరించనున్నాయి.

ఈ కార్యక్రమాల్లో భాగంగా మే 9 నుంచి 17 వరకు మాల్ సెంట్రల్ ఏట్రియంలో ఏర్పాటు చేసిన 'నింజా క్యాజిల్' చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పిల్లల్లో చురుకుదనం, వేగం, శారీరక సమన్వయాన్ని పెంపొందించేలా రూపొందించిన ఈ ప్రత్యేక ఆటల జోన్‌లో పలు ఆసక్తికర గేమ్స్ అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా 'నింజా స్లాష్ జోన్'లో పిల్లలు మోషన్ ట్రాకింగ్ స్క్రీన్ ముందు నిలబడి గాలిలో వచ్చే పండ్లను నరికే వినూత్న ఆటను ఆస్వాదిస్తున్నారు. అలాగే పెయింటింగ్, పజిల్స్ వర్క్‌షాప్‌లు, నింజా రియాక్షన్ గేమ్స్, ఫోటో జోన్‌లు కూడా చిన్నారులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి చిన్నారికి "ఇనార్బిట్ సర్టిఫైడ్ నింజా" సర్టిఫికెట్ అందజేస్తున్నారు.

వేసవి వేడుకల్లో భాగంగా మే 22 నుంచి 24 వరకు లెవెల్ 1లో 'మ్యాంగో ఫెస్ట్' నిర్వహించనున్నారు. మామిడి పండ్లతో తయారుచేసిన వివిధ రకాల ప్రత్యేక వంటకాలు, స్వీట్లు, డెజర్ట్స్ సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. ఇక మే 29 నుంచి జూన్ 7 వరకు సెంట్రల్ ఏట్రియంలో 'లెగో ప్లే జోన్' ఏర్పాటు చేయనున్నారు. ఇందులో పిల్లల ఆలోచనా శక్తి, నిర్మాణ నైపుణ్యాలను పెంపొందించేలా లెగో సవాళ్లు, ఫ్రీ ప్లే యాక్టివిటీలు నిర్వహించనున్నారు.

వేసవి సెలవులను కుటుంబ సమేతంగా సరదాగా గడపాలనుకునే వారికి ఈ ప్రత్యేక కార్యక్రమాలు మంచి వినోదాన్ని అందించనున్నాయని మాల్ నిర్వాహకులు తెలిపారు.

# దక్షిణాదిలో టీఈసీ విస్తరణ

వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా ది ఎగ్జిక్యూటివ్ సెంటర్ దక్షిణ భారత మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై నగరాల్లో కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ ప్రకటించింది. దక్షిణాదిలో మొత్తం 4.65 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక కార్యాలయ స్థలాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపింది. ఈ విస్తరణతో సుమారు 6 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని సంస్థ వెల్లడించింది. ఇందులో బెంగళూరులో 91 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ స్థలం ఏర్పాటు చేయనుండగా, అక్కడ సుమారు 1,100 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. అలాగే హైదరాబాద్‌లో 2.04 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక కార్యాలయ ప్రాంగణాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రంలో దాదాపు 2,820 మంది కూర్చొని పనిచేసే సౌకర్యం ఉండనుంది. దక్షిణ భారత నగరాల్లో పెరుగుతున్న ఐటీ, స్టార్టప్, కార్పొరేట్ సంస్థల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ విస్తరణ చేపట్టినట్లు సంస్థ పేర్కొంది. ఆధునిక సదుపాయాలతో కూడిన కార్యాలయ వాతావరణాన్ని అందించడం ద్వారా సంస్థలు, ఉద్యోగులకు మెరుగైన పని అనుభవాన్ని కల్పించడమే లక్ష్యమని తెలిపింది.




# వాణిజ్యలోటు మళ్లీ పెరుగుదల





దేశ వాణిజ్యలోటు మరోసారి ఆందోళన కలిగిస్తోంది. ఎగుమతులు రెండంకెల వృద్ధిని నమోదు చేసినప్పటికీ, దిగుమతులు కూడా భారీగా పెరగడంతో వాణిజ్యలోటు మూడు నెలల గరిష్ఠ స్థాయికి చేరుకుంది. తాజాగా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం, గత నెలలో దేశ ఎగుమతులు 12.78 శాతం పెరిగి 43.56 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇదే సమయంలో దిగుమతులు 10 శాతం పెరిగి ఆరు నెలల గరిష్ఠ స్థాయి అయిన 71.94 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసమైన వాణిజ్యలోటు 28.38 బిలియన్ డాలర్లకు పెరిగింది. గత ఏడాది ఇదే నెలలో ఇది 27.1 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

ఈ సందర్భంగా వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ దేశ ఎగుమతులు బలంగా పెరగడం సానుకూల సంకేతమన్నారు. గత ఐదు నెలల్లో ఇదే అత్యధిక వృద్ధి అని తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులు 40.31 శాతం పెరిగి 5.17 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 34.66 శాతం పెరిగి 9.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అలాగే లోహాలు, పాల ఉత్పత్తుల ఎగుమతులు 48 శాతం, ఇంజినీరింగ్ ఉత్పత్తులు 8.76 శాతం, ఔషధ ఉత్పత్తులు 7.12 శాతం చొప్పున పెరిగాయి. సింగపూర్, తాంజానియా, శ్రీలంక, బంగ్లాదేశ్, హాంకాంగ్, మలేషియా, ఆస్ట్రేలియా, వియత్నాం దేశాలకు భారత ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. అయితే పశ్చిమాసియా దేశాలకు ఎగుమతులు 28 శాతం తగ్గి 4.16 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇక బంగారం దిగుమతులు 81.69 శాతం పెరిగి 5.62 బిలియన్ డాలర్లకు చేరుకోగా, వెండి దిగుమతులు 157.16 శాతం పెరిగి 411 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. మరోవైపు ముడి చమురు దిగుమతులు 10 శాతం తగ్గి 18.7 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

# రూపాయి విలువకు మరో భారీ దెబ్బ

అమెరికా డాలర్ బలపడటం, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావంతో భారత రూపాయి విలువ మరోసారి భారీగా క్షీణించింది. డాలర్‌తో పోలిస్తే దేశీయ కరెన్సీ తొలిసారిగా 96 మార్కు దిగువకు పడిపోవడం మార్కెట్లలో ఆందోళన కలిగిస్తోంది.

శుక్రవారం ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో రూపాయి 95.86 వద్ద ప్రారంభమై, ఒక దశలో 96.14 వరకు పడిపోయి చరిత్రలోనే కనిష్ఠ స్థాయిని తాకింది. అనంతరం కొంత కోలుకుని 95.81 వద్ద ముగిసింది. గురువారంతో పోలిస్తే రూపాయి విలువ 17 పైసలు తగ్గింది. అమెరికా-ఇరాన్ యుద్ధ ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. గల్ఫ్ దేశాల్లో చమురు, వాయువు ఉత్పత్తి తగ్గిపోవడం, హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం వంటి పరిణామాలు ప్రపంచ సరఫరా వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో భారత్ సహా అనేక దేశాల్లో డాలర్లకు డిమాండ్ పెరిగింది. దేశంలో పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు పెరగడం, వంటగ్యాస్ ధరల పెంపు కారణంగా ద్రవ్యోల్బణ భయాలు కూడా రూపాయి పతనానికి కారణమవుతున్నాయి. దిగుమతుల ఖర్చు పెరగడం వల్ల రూపాయిపై ఒత్తిడి మరింత పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు రూపాయి విలువ దాదాపు 6 రూపాయలు క్షీణించింది. గత ఏడాది డిసెంబర్ 31న డాలర్ మారకం విలువ 89.88 వద్ద ఉండగా, ప్రస్తుతం 95.81కు చేరుకుంది. అంటే నాలుగున్నర నెలల్లోనే రూపాయి విలువ 6 శాతానికి పైగా క్షీణించినట్లైంది. గత ఆరు ట్రేడింగ్ సెషన్లలోనే రూపాయి దాదాపు 2 శాతం నష్టపోయింది.



అమెరికాలో రిటైల్ అమ్మకాలు పెరగడం, ఉద్యోగ మార్కెట్ గణాంకాలు బలంగా ఉండటం వల్ల డాలర్ ఇండెక్స్ మరింత బలపడుతోంది. అలాగే అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులు, కృత్రిమ మేధస్సు ప్రభావంతో భవిష్యత్ పెట్టుబడులపై నెలకొన్న అయోమయం కూడా డాలర్‌కు మద్దతు ఇస్తోందని కరెన్సీ మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. విదేశీ మదుపర్లు దేశీయ మూలధన మార్కెట్ల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకోవడం, వాణిజ్యలోటు పెరగడం కూడా రూపాయి పతనాన్ని మరింత వేగవంతం చేస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోక్యం చేసుకుంటున్నప్పటికీ, ముడి చమురు ధరలు తగ్గేదాకా రూపాయి ఒత్తిడిలోనే కొనసాగే అవకాశముందని ఆర్థిక వర్గాలు అంచనా వేస్తున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక



# ప్రేమపై తమన్నా వ్యాఖ్యలు

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తన అందం, నటనతో అభిమానులను ఆకట్టుకున్న నటి తమన్నా భాటియా తాజాగా ప్రేమ, బంధాలపై చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ప్రేమ అంటే ఏమిటి, సంబంధాల్లో వ్యక్తిగత స్వేచ్ఛ ఎంత ముఖ్యమనే అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో ప్రేమ ఒక్కసారి మాత్రమే కాకుండా ఎన్నోసార్లు పుడుతుందని తమన్నా అన్నారు. ప్రేమ అనేది జీవితంలో పదేపదే అనుభూతి చెందాల్సిన భావమని, దానిని కేవలం ఒక సంఘటనగా చూడకూడదని పేర్కొన్నారు. ప్రస్తుతం యువత ప్రేమ, సంబంధాల విషయంలో చాలా గందరగోళానికి గురవుతున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. ఎవరినైనా నిజంగా ప్రేమిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని తమన్నా స్పష్టం చేశారు. మన ఆలోచనలు, అభిరుచులను ఎదుటివారిపై బలవంతంగా రుద్దడం ప్రేమ కాదని తెలిపారు. ప్రేమ అనేది హావభావాలతో చూపించేది కాదని, అది మనసులో పుట్టే స్వచ్ఛమైన భావన అని వివరించారు. వ్యక్తిగత బంధాల్లో పరస్పర గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ చాలా ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ఒకరిని ప్రేమించడం అంటే వారి నిర్ణయాలను గౌరవించడం కూడా కావాలని చెప్పారు. ప్రస్తుతం తమన్నా చేసిన ఈ వ్యాఖ్యలు యువతలో విస్తృత చర్చకు దారితీస్తున్నాయి.




## సినిమాలకు గ్యాప్ రావడం బాధేసింది: సదా

తెలుగు సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా ప్రేక్షకుల ప్రేమను అందుకుంటున్న నటి సదా తన సినీ ప్రయాణం, కెరీర్‌లో ఎదురైన సవాళ్లు, వ్యక్తిగత అనుభవాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జయం', 'అపరిచితుడు' వంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులకు ఎంతో దగ్గరైనప్పటికీ, తన ప్రతిభకు తగిన స్థాయిలో అవకాశాలు రాకపోవడం బాధ కలిగించిందని ఆమె పేర్కొన్నారు. తన సినీ ప్రయాణంలో తక్కువ సినిమాలే చేసినా ప్రేక్షకుల ప్రేమ మాత్రం ఎప్పుడూ తగ్గలేదని సదా తెలిపారు. జయం, నితిన్, ఉదయ్ కిరణ్ వంటి హీరోలతో చేసిన చిత్రాలు ఇప్పటికీ ప్రేక్షకులకు గుర్తుండిపోవడం ఆనందంగా ఉందన్నారు. "జయం సినిమా తర్వాత కూడా నా కెరీర్‌లో పెద్ద గ్యాప్ వచ్చింది. అవకాశాలు రాలేదని చెప్పలేను కానీ అవి నా వరకు చేరలేదు. అప్పట్లో సోషల్ మీడియా లేకపోవడం, ముంబైలో ఉండటం వల్ల ఇండస్ట్రీలో సరైన కమ్యూనికేషన్ జరగలేదు" అని వెల్లడించారు. సినిమా నేపథ్యం లేని కుటుంబం నుంచి వచ్చిన తాను మొదట్లో నటనను పూర్తి స్థాయి కెరీర్‌గా భావించలేదని సదా తెలిపారు. 'జయం' తర్వాత తిరిగి ఐటీ చదువులపై దృష్టి పెట్టానని, ఆ సినిమా అంత పెద్ద విజయమవుతుందని అప్పట్లో ఊహించలేదని చెప్పారు. "జయం లేదా అపరిచితుడు లాంటి సినిమాలు నా జీవితాన్ని మార్చేశాయి. ఆ సినిమాలు లేకపోతే నేను ఈరోజు ఇక్కడ ఉండేదాన్ని కాదు" అని ఆమె అన్నారు. తమిళంలో చేసిన 'టార్చ్ లైట్' చిత్రం గురించి మాట్లాడుతూ ఆ సినిమా తనకు మానసికంగా చాలా సవాల్‌గా అనిపించిందని తెలిపారు. "అలాంటి పాత్ర చేయడం నాకు చాలా భయంగా అనిపించింది. కానీ కథ అవసరం కావడంతో చేశాను. అయితే ప్రేక్షకులు కథను అర్థం చేసుకోవడం కంటే నేను ఎందుకు అలాంటి పాత్ర చేశానని విమర్శించారు. ఆ సినిమా చేసిన తర్వాత చాలా బాధపడ్డాను" అని ఆమె పేర్కొన్నారు.




## 'దళ పతి' ట్యాగ్‌కే విజయ్ గ్రీన్ సిగ్నల్

తమిళనాడు రాజకీయాల్లో సంచలన విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయకన్' విడుదలకు సిద్ధమవుతోంది. ఎన్నికలకు ముందే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పలు కారణాలతో వాయిదా పడుతూ వచ్చినప్పటికీ, వచ్చే నెలలో భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న నేపథ్యంలో, సినిమాలో ఆయన పేరుకు ముందు ఎప్పటి నుంచో వినిపిస్తున్న 'దళపతి' బిరుదుకు బదులుగా 'ముఖ్యమంత్రి విజయ్' అని ప్రదర్శించాలని నిర్మాతలు భావించినట్లు సమాచారం. అయితే ఈ ప్రతిపాదనను విజయ్ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. తనను ఈ స్థాయికి తీసుకొచ్చింది ప్రేక్షకుల ప్రేమేనని, అందుకే అభిమానులు ఇచ్చిన 'దళపతి' బిరుదునే కొనసాగించాలని ఆయన స్పష్టం చేసినట్లు కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. అంతేకాదు, రాజకీయ హోదాకు తగ్గట్టుగా సినిమాలోని కొన్ని సన్నివేశాలు, పవర్‌ఫుల్ రాజకీయ డైలాగులను మార్చాలనే ఆలోచనను కూడా విజయ్ అంగీకరించలేదని సమాచారం. సినిమాను రాజకీయ ప్రచార వేదికగా కాకుండా, పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రంగానే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది.




## చైత్ర ఆగ్రహం.. అసభ్య సందేశాలు పంపిన నెటిజన్ బండారం బయట!

సోషల్ మీడియాలో తనకు ఎదురైన ఆన్‌లైన్ వేధింపులపై కన్నడ నటి, గాయని చైత్ర జె. అచార్ తీవ్రంగా స్పందించారు. 'సప్త సాగరాలు దాటి' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ నటి.. తనకు అసభ్యకరమైన సందేశాలు పంపిన ఓ నెటిజన్‌ను సోషల్ మీడియా వేదికగా బహిర్గతం చేశారు. ఆ వ్యక్తి పోలీస్ శాఖకు చెందినవాడిగా భావిస్తున్నానంటూ బెంగళూరు నగర పోలీసులను ట్యాగ్ చేస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుకుగా ఉండే చైత్ర అచార్ ఇటీవల కొన్ని ఫోటోషూట్ చిత్రాలను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. అయితే ఆ ఫోటోలపై 'మహేష్ హోసమని' అనే ఖాతా నుంచి అసభ్యకరమైన వ్యాఖ్యలు, అభ్యంతరకర సందేశాలు రావడంతో ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆ ఖాతా ప్రొఫైల్ చిత్రంలో పోలీస్ యూనిఫామ్‌లో ఉన్న ఫోటో కనిపించడంతో ఈ వ్యవహారాన్ని ఆమె మరింత సీరియస్‌గా తీసుకున్నారు.

ఆ సందేశాల స్క్రీన్‌షాట్లను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్న చైత్ర.. "గౌరవనీయులైన బెంగళూరు నగర పోలీస్ అధికారులు.. ఈ వ్యక్తి మీ శాఖకు చెందినవాడేనా? మహిళలతో ఇలాంటి భాషలో మాట్లాడటానికి మీ శాఖ అనుమతిస్తుందా?" అంటూ ప్రశ్నించారు. మహిళలను, ముఖ్యంగా సినీ పరిశ్రమకు చెందిన నటీమణులను కొందరు ఎంత తక్కువగా చూస్తున్నారో ఈ సంఘటన ద్వారా బయటపడిందని ఆమె మండిపడ్డారు.



## విశాఖలో అనిల్ రావిపూడి మకాం..

టాలీవుడ్‌లో రూపొందుతున్న భారీ మల్టీస్టారర్ చిత్రాల్లో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్‌రామ్ కలయికలో తెరకెక్కనున్న కొత్త సినిమా ప్రత్యేక ఆకర్షణగా మారుతోంది. కుటుంబ కథా చిత్రాలు, వినోదాత్మక సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న దర్శకుడు అనీల్ రావిపూడి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండటంతో సినీ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై సామాజిక మాధ్యమాల్లో చర్చలు కొనసాగుతున్నాయి.

వెంకటేష్‌కు ఉన్న కుటుంబ ప్రేక్షకుల ఆదరణ, కళ్యాణ్‌రామ్‌కు ఉన్న మాస్ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా దీనిని రూపొందిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. నవ్వులు, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలను సమతూకంగా మేళవిస్తూ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా కథను సిద్ధం చేస్తున్నారట. ముఖ్యంగా వెంకటేష్ కామెడీ టైమింగ్‌కు అనీల్ రావిపూడి శైలి హాస్యం జతకావడంతో ఈ చిత్రం ప్రేక్షకులకు పూర్తి వినోదాన్ని అందించబోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తాజా సమాచారం ప్రకారం దర్శకుడు అనీల్ రావిపూడి ప్రస్తుతం తన బృందంతో కలిసి విశాఖపట్నంలో మకాం వేసి కథ, సన్నివేశాలకు తుది మెరుగులు దిద్దుతున్నట్లు తెలుస్తోంది. పాత్రల రూపకల్పన, కీలక భావోద్వేగ సన్నివేశాలు, హాస్య ఘట్టాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారట. సినిమా ప్రారంభం నుంచి చివరి వరకు ప్రేక్షకులను అలరించేలా కథనం ఉండే విధంగా స్క్రీన్‌ప్లేను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా భారీ స్థాయిలో నిర్మిస్తున్నాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in